కథ :

# గురువులు

చంద్రుడు

"నేనెర్ర గొర్రెన్ తింటా...."

"నీతాత పెంచలేదు...."

"నే నెట్ట మేకలు తింట...."

"నీ అయ్య పెంచలేదు...."

పాట మంచి జోరుమీద సాగుతోంది.... ముడ్డికి కట్టిన పంచె మీదికి ఎగగట్టి-తువ్వాల నడుంకుకట్టి, ఎవళదో అడుక్కున్న పెద్ద అంగీ వేసుకొని ఇంతా మీసాలున్న దాని పిలగావొకడు అవతలి వేపున్న పిల్లల గుంపులోని ఎర్రటి పిలగాని మీదికి ఎగబడుతూ అచ్చు దొరలాగే గుడ్లు తిప్పుతున్నాడు. ఎదుటి పిల్లలు ఆ ఎర్రటి పిల్ల వాన్ని మధ్యలో పెట్టుకొని దొరలాగే మీదికొస్తున్న పిల్లవాని మీదికి ఉరుకుతున్నారు. పాట సాగుతోంది.....వాదన పెరుగుతోంది.... ఇరుపక్షాలల్లో కోపం పెరుగుతోంది....

పైన ఆకాశంలో మాఘమాసపు తేటతేట వెన్నెల....చల్లగా మెల్లమెల్లగా వీచే పైరగాలి....ఊరికి దగ్గరగా ఉన్న పెరళ్ళలో ఉండీ ఉండీ కావలివాళ్ళ వేసే కేకలు....అప్పుడప్పుడు వేసంగి పొలాల్లోనో-వాగొడ్డు మీదనో నక్కల ఊళలు.... సాకల్లి ఊరు తిరిగిపోయింది.... పండల కాడికి కావలి పోవలసిన వాళ్ళు కొర్రాయిలు పట్టుకొని శద్దర్లు, గొంగళ్లు కప్పుకొని చుట్టలు తాగుతూ పిల్లల ఆటనుచూస్తూ కావలి మరిచిపోయి నిలుచున్నారు.... దగ్గరి ఇండ్ల ఆడోల్లు అందరికి భోజనాలు పెట్టి ఆఖరి గడుక మాడిసెక్కలు తెల్లగిన్నెల్ల[1] వేసుకొని అరిచేతిల పెట్టుకొని తినుకుంట తినుకుంటనే ఆట దగ్గరికొచ్చి చూస్తున్నారు.... ఏ పని లేని ముసలివాళ్ళ 'అట్ల కాదుర గిట్ల' అని పిల్లలకు సలహాలిస్తున్నారు. ఆటలో పాల్గోని పిల్లలు ఒకరి జబ్బలమీద ఒకరు చేతులేసుకొని దొరవేషగాని తిప్పల్లకు పక్కడ పక్కడ నవ్వుతున్నారు....

1. అల్యూమినియం పాత్రాలు

పిల్లలు కోలాహలంతో ఆడుకుంటున్న అలాంటి వెన్నెల రాత్రి, ప్రతి మనిషి గుండె రెపరెపలాడే పైరగాలి వెన్నెలరాత్రి—ఊరంతా ఎవరి సంతోషంతో వాళ్ళు, ఎవరి పనుల్లో వాళ్ళుంటే—ఊళ్ళోని కొద్దిమంది మాత్రం మందోట కాడి మర్రి కింద మల్లగుల్లాలు[2] పడుతున్నారు....కొందరు గొణుగుతున్నారు. మరికొందరు గుసగుసగా ఏదో చెప్పుతున్నారు....

తాటి కమ్మల గుడిసె- గుడిసెమీన దెబ్బకొడితే ఒడిసి నన్నట్టు-మీరెక్కలు మీకున్నయి...ఈడగాదు ఇందుర్లకు బోయినా మీరెక్కలెవడు తీసుకోడు...ఇగో మనం సంఘం బెట్టినం ...దొరలను తరిమి కొట్టినం.... గండట్ల మీతోపాటు మేము ఉన్నం ...మనందరి మీద కేసులు బెట్టిండ్లు ...మేం కేసుల సుట్టు తిర్గుతాంటే— గొడ్డు, గోదా, పంట గంగల గల్సినయ్.... మేం దాపుకున్నదేంలేదు ...పంచుకున్నదేం లేదు.... పెట్టిన పెట్టుబడి బాపె....రెక్కల కష్టం అట్లా ఉంచండ్లి.... ఇగో మనంట్లే మనకు ఏరుద్దం[3] లేదు ... రైతు కూలీలు బాగు పడాల్నంటే, పాలేరోల్ల జీతాలు పెరుగన్నంటే మేం మీ ఎంటుండ లేదా! గిప్పుడు మిరపకాయ ఏరుడు కూలి పెంచాల్నంటే.... సంఘం మా బాధలు సుక[4]మూడాలె" పెర్క వీరసామి చాలా శాంతంగా చెప్పుకొచ్చాడు....

"తెల్సిందయ్యా ! మీ కడుపుల మాట దెల్సింది.... కూలినాకొడుకు ఉపాస ముప్పిడున్నా పర్వాలేదు- మా పంటలు బోయినయనే గదా మీ ఏడుపు ... మేం కేసుల్లబోతే మా పోరగండ్లు ఉపాసాలున్నరు.... మీవోల్లు మంచిగ తినుకుంట కూకున్నరు ..." సారలి లేచిపోతూ అన్నాడు....

"మరి గట్లంటే....మరి ..." వీరసామి రుమాలు దుట్టుకుంటూ ఏదో అన బోయాడు. ఛిక్కని మర్రి ఆకులు ఛేదించుకొని బాకులా వెన్నెల ముక్కొకటి వీరసామి ముఖం మీద మెరిసింది.

రైతుకూలీలను సమర్థిస్తూ కొందరు ఉద్రేకంగా మాట్లాడారు.... అంత ఉద్రేకంతో కాకున్నా సంఘం పేదరైతులు—మధ్యతరగతి రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని—నిజానికి ఇంతవరదాకా జరిగిన అన్ని పోరాటాల్లో తామే ఎక్కువ నష్టపోయామని వీరసామి చెప్పుకొచ్చాడు.

---

2. తర్జన భర్జన 3. భేదాభావం 4. కూడా

826

ఒక్క పెంటయ్య మాత్రం తలపట్టుకొని కూర్చున్నాడు. అతనికి ఇద్దరి వాదనలు నిజమే ననిపించింది.... నిజానికి పోరాటంలో ముందుండి తన్నులు గుద్దులు తిని, ఆకలికి మాడింది రైతు కూలీలే.... కాని మధ్యతరగతి రైతు వీరసామి లేవ నెత్తిన విషయాలకు తనదగ్గర సమాధానం లేదు. ఈ గలాటా చూస్తే రేపు మిరప కాయలు ఏరడానికి కూలి పెంచాలనే పోరాటంలో ఇద్దరూ చెరో పక్క నిలబడ వచ్చు....

"ఇగో ఏది ఏమైనా మాకు సాల్తలేదు.... ఈపారి దినానికి మనిషికి తక్కెడు వరుగు (పండుమిర్చి) సవాసేరు పచ్చికాయలు ఇయ్యాల్సిందే" అన్నాడు సన్నగా పొట్టిగా ఉన్న రాములు....

అక్కడ కూర్చున్న వాళ్లలో అయిదుగురు ఆ మాటకు సపోర్టు చేశారు.... సేరాలు అనే బీదరైతు ఎటూ సప్పుడు చెయ్యలేదు.... లింగయ్య అనే పేదరైతు "వీరాసామన్న చెప్పింది సుత సమజ్ చేసుకోవాలె" నన్నాడు....

అంటే రేపు తక్కెడు వరుగు—సవాసేరు పచ్చికాయలు- ఇచ్చేదాక సమ్మె జరుగ గలదని అక్కడి వాళ్ళందరికి అర్థమయ్యింది.

వీరసామి "మీ అందరికి ఇష్టమైతే నాదేమున్నది.... నాకు యింతో అంత తెలుసుగని.... గీపారి ఊళ్ళె గుసగుసలు లేత్తయి. గదానికి నన్ను అనద్దు.... సంఘం కట్టంటె కట్టే.... నేను మాత్రం మాటమీద నిలుసుంట.... అందరికి నేను చెప్పేదేమంటే- ఇగో సంఘం ఏదన్న ఒక పక్క ఉంటదని మాటరావద్దు...." వీరసామి ఆఖరు మాటగా చెప్పాడు....

పెంటయ్య తనేదన్నా చెప్పుదామనుకున్నాడు. కాని అతనికి ఏదీ తోయ లేదు.... ఇలాంటి ధోరణి అప్పుడప్పుడు బయటపడ్డా ఎప్పటికప్పుడు సదురుక పోవుడేగని-దానికి జవాబు గిదాని స్పష్టంగా తెలియడంలేదు.... ఈసారి తెలుసుకో వాలెనసుకున్నాడు పెంటయ్య.

ఆ తర్వాత రేపు చేపట్టవలసిన సమ్మె పోరాటంలో ఏ విధంగా ముందుకు పోవాలోనని విచారణ సాగింది ... ఊళ్ళో హరిజనవాడలో, గొల్లోల్ల వాడలో, తెను గోల్ల వాడలో, మూడు పానాదులకాడ గోడలకు కాయిదాలు వెయ్యాలని, పొద్దున్నే వాళ్ళ వాళ్ళ వాడల్లో ఈ సంగతి ప్రచారం చేయాలని నిర్ణయం జరిగింది.

ఎటోల్లటు లేచిపోయారు.... పెంటయ్య మూడు పానాదుల[5]దగ్గర జరిగే పిల్లల ఆట దగ్గర కాసేపు నిలుచున్నాడు. తన చిన్న కీచు గొంతుతో ఏదో పాడుతున్నాడు. ఓ పక్క విష్టు మరికొంతమంది పిల్లలు "ఢీలమ్మ ఢీవి" ఆడుతున్నారు.... కరంటు స్తంభం పక్క భార్య సత్తెమ్మ ఎవలతోనో ముచ్చెట బెడ్తంది....

పెంటయ్య అక్కడినుండి గుడిసె కొచ్చేటాల్లకు ఇంటిముంగిటి కొట్టంల[6] ఎడ్లకు ఎవలో జొడు సొప్ప కర్ర[7] లేత్తండ్లు....

"ఎవలు ?".... పెంటయ్య లోపటికొచ్చి....

"నేనే...." అన్నాడు కర్రలేస్తున్న వ్యక్తి....

"ఎప్పుడొచ్చినవ్....అంత బాగేనా ! నువ్వాట్లుండు నేను మీ అక్కను పిలుసుకత్తా...." పెంటయ్య....

"పిల్లలు ఆడుతున్నట్లున్నది....ఉండనీయ్ ....నేనిప్పుడే తినచ్చిన....ఎడ్లు చెవులు లొడలొడ గొట్టుకుంటాంటె గడంచా[8] తెచ్చుకోంగ కర్రలు కన్పిస్తే తెచ్చేసిన...." అన్నాడతను....

పెంటయ్య గడంచ పట్టెమీద కూకున్నడు...."ఇగో పోను పోను కంచె సిక్కు బడ్డట్టయితంది.... నాకేం సమఝుయిత లేదు" అని మొదలేసి ఇంతక్రితమే జరిగిన సంఘం మీటింగుల సంగతులన్ని వివరంగా చెప్పుకొచ్చాడు ...

మధ్య మధ్య వివరాలడుగుతూ – అప్పుడప్పుడు మళ్ళీ చెప్పించుకుంటూ.... మొత్తానికి అంతా విని కాసేపు మాట్లాడలేదు....

"నిజమే ...అన్ని సంఘాలకు ఇలాంటి సమస్యలొస్తున్నయ్...." లేచి నిలబడి పచారు చేస్తూ....

"ఎట్లా....మరి దీనికేమన్న ఉపాయం సూడకపోతే !"

"ఇది ఎందువలన ఎదరై లేందన్నది మొదటి సంగతి....దొరలు వాళ్ళ సర్కారు వాళ్ళ పబ్బం గడుపుకోనేటందుకు కులాలను, గిసోంటి భేదాలను పెంచి పోషించింది....మన పల్లెల్లో రైతు కూలినుంచి మొదలుకొని దొరలదాకా చాలా అంతరాలున్నాయి.... పల్లెల్లో కూడు— గుడ్డకు నోచుకోక అనేక వందల ఏండ్లు రైతుకూలీలు అణచబడ్డారు. కనుక తక్షణంగా మనం చేపట్టింది వాళ్ళ సమస్యలనే....

---

5. మూడు దారులు కలిసే కూడలి, 6. పశువుల పాక, 7. పశువుల ఆహారంగా వాడే జొన్న కర్రలు, 8. చిన్న కుక్కి మంచం.

828

పోరాటంలో ముందు నిలిచింది అధిక సంఖ్యలో ఉన్నవాళ్ళే....వాళ్ళ వాళ్ళ స్వంత లాభాలకోసమైతేంది - దొరలతోటి అంతో యింతో బాధలు పడ్డందుకైతేనేమి కొందరు మధ్యతరగతి రైతులు మనతో కలిసి వచ్చిండ్లు - మరికొందరు - గిదెట్లుం టదోనని ఎటూ పోకుంట సూసుకుంట కూకున్నరు. మనం ఇప్పటివరకు చేసిన పోరాటాలన్నీకూడా ఎక్కువగా రైతు కూలీలకే లాభించాయి.: భూములు పోగొట్టు కున్న పేదరైతులకు లాభించాయి....అయితే మనం కూలీరేట్ల పోరాటం చేపడితే సహజంగా మధ్యతరగతి రైతులు దీన్ని వ్యతిరేకిస్తారు. ధనిక రైతులు "అగో చూసిండ్లా సంఘపోల్లు ఎప్పటికైనా మాదిగ మాలోల్లను దగ్గరికి దీత్తరుగని మిమ్ముల పట్టించుకుంటారా" అని ప్రచారం చేస్తారు....నిజానికి కూలిరేట్లు పెరగటం వలన మధ్యతరగతి నష్టపోయేది చాలా తక్కువ.... ఈ నష్టం గురించి గోరంతలు కొండంతలుగా ఊహించుకుంటారు. నిజానికి రైతాంగమంతా నష్టపోయేది కూలీలకు అధిక కూలీలివ్వడం వలన కాదు....తమ తిండికి పోగా ఏమన్న అమ్ముకుందామంటే గక్కడ నష్టపోతండ్లు - పండించే పంటకు గిట్టుబాటు ధరలేదు - ఇయ్యాలున్న ధర రేపుండదు - దీస్లై[9] సేట్లంత కూడ బలుక్కొని వాళ్ళడిగింది రేటు - నిలకడ లేని ధరలన్నమాట - ఈ రైతులు కొనే ఉప్పు, నూనెలు, బట్టలు, ఎరువులు, ఇనుము అన్నీ ఏడాదికేడాది పెరుగుతయిగని తరుగయ్. నిజంగా రైతు నష్టపోతున్న దక్కడ...."

"అది నిచ్చమే కని మనం గిట్టుబాటు ధరల గురించి ఏదన్నా చేత్తె బాగుండు" పెంటయ్య....

"బాగనే ఉంటది....కని మొదటిది మన వాళ్ళందర్ని అందుకు తయారు చెయ్యాలె— పేదరైతుల, రైతుకూలీలు గది మాదిగాదని ముందుకు రారు.... రెండోది మొత్తం తాలుకానో, జిల్లానో కదిలియ్యాలె....ఆ పిలుపు యివ్వాలె ఈసారి...."

పెంటయ్యకు అది నిజమే ననిపించింది....

"ఇయ్యేడు మెట్టుపల్లి తాలుకాల కాలువ పారుకం భూములకు ఎక్కువ తాసీ[10] లేసిండ్లు....మనం తాలుకా తాలుకా నంత కదిలిచ్చినం.... తాసీలు కట్టకుంట చేసి నం....గిందట్ల ధనిక రైతులు మత కలిసచ్చిండ్లు...."

---

9. వ్యవసాయ మార్కెట్లు. 10. భూమి శిస్తు.

829

వీళ్ళిద్దరు ఇట్లా మాట్లాడుకుంటూ ఉండగానే సత్తెమ్మ పిల్లలు వచ్చారు.... మూడు పానాదుల కాడ 'పోస్టరేసిండ్లని' పిల్లవాడు చెప్పాడు.

* * *

ఇంకా తెల్లారలేదు....కాని ఊరు ఎప్పుడో లేచిపోయింది. బరుకా బరుకా చీపుర్ల చప్పుడు, అలుకు జల్లడం చప్పుడు - చింతలమీద పిట్టలు, కాకుల అరుపులు, దొడ్లల్లో ఆవుల అరుపులు.... పిల్లల ఏడుపులు, ఆలస్యంగా లేచిన కోడిపుంజుల కూతలు - నల్లపిట్ట పీచు పీచు మంటోంది ఎప్పటినుండో. మొత్తానికి ఊరంతా సందడిగా ఉన్నది....

తలపాగలు చుట్టుకొని పండ్ల పుల్లలేసుకొని మన్నెపోల్ల నాంచారి, గౌండ్ల వీరయ్య ఇద్దరు కలిసి పెంట్లి బుచ్చిరెడ్డి ఇంటికొచ్చిండ్లు.... బుచ్చిరెడ్డి రెండుకాళ్ల మధ్య సర్వ బెట్టుకొని పాలు పిండుతున్నడు.

కొడుకు సమ్మిరెడ్డి పెద్ద బండికి సిక్కమేత్తండు. కోడలు వాకిట్లో ముగ్గులు పెడులోంది....

"పొద్దుగాల్నే లేసిండ్లు పటేలా!" నాంచారి గోడపక్క బండమీద కూసుంటూ....

అప్పుడప్పుడే తూరుపు రేకలు బారుతున్నాయి - బజాట్ల ఒర్ల సాయిలు "ఓ బర్లిడుపుండ్లి బర్లోయ్" అంటూ కేక పేాడు.

బుచ్చిరెడ్డి బర్రె తలుగు తప్పదీసి దుడ్డెనిడిచి, పాల సరువ గూట్లె బెట్టి

"ఎటో వచ్చిండ్లు పొద్దుగాల్నే...." అన్నాడు.... వాల్చున్న గడంచలో కూలబడుతూ - గౌండ్ల వీరయ్య అతని పక్క కూర్చున్నాడు.

"ఇగో మిరుపతోటలు ఏరుదామనుకుంటిమా? నాత్రి గోడలమీద కాయిదా లేసిండ్లు...." వీరయ్య....

"ఎయ్య నియ్యండ్లి - మనం సంగం మనుషులమే గద." బుచ్చిడ్డి ఓరరె గంట నాంచారిని చూస్తూ -

"మన మనుకుంటె అయితాది" నాంచారి కాలుపెండి బేడి[12] అటిటు తిప్పుకుంటూ....

---

11. గేదెలు. 12. సన్నటి కడియం.

830

"తొండబ్బిరు ఎసుగుండాక - మరో నాలుగు దినాలు ఎక్కువైతాది. ఎవలమాల్లు ఏరుకుందాం - మనకున్న తోటలెంత దమ్మిడి కాసంత...." బుచ్చి రెడ్డి.

"అది నిచ్చమే ననుకోండ్లి - కని నాలుగు దినాలల్ల కాయెండుతది.... అపు తల దీస్లెకు నరుకు బొబ్బలు కొట్టి దిగుతది....తీరింది మగసా ఊరు దాటియ్యమంట గప్పుడుబోతే పల్ల[13]కు మున్నూరు బత్తె నేను చెపుగోపిచ్చుకుంట...." నాంచారి.

"మరి పల్లకచ్చి మంత దాసుదేంది. నీ మరుసులున్న మాట చెప్పరాదు...." వీరయ్య అన్నాడు అప్పటికి సూర్యోదయమయ్యింది....

"నాదేమున్నది....ఎట్లయినా మీ ఎక్కువోల్లు ఏదంటే అది చెల్తది...." నాంచారి....

"బాగని....మీ రాజిరెడ్డి ఏమంటండు." వీరయ్య అడిగాడు....

బుచ్చిరెడ్డి కిందా మీద చూసి - వాడు మా అన్నకొడుకన్నమాటేగని నాకేం చెప్పతడు - నాకన్న ఊళ్ళోల్లకే దగ్గర....అయినవాడు ఏకాదాయె సంగపోల్లకు దూరముండబట్టి.... వాడే కేసుల్లబడి పీక్క పీక్క సత్తండు...." అన్నాడు.

"అగో గక్కనే ఉన్నది ఎవారమంత.... గీ సంగపోల్లు ఒక్కొక్కన్ని మసలను దూరం గొడుతరు - దొరలకు ఎతిరేకంగా ఉన్నోడు అంటే ఉన్నోడు అన్నరు. దొరలు బోయినంక మనమీద బడ్డరు.... అగో మీ రాజిరెడ్డిని దూరం గొట్టినట్టు...." వీరయ్య....

"అది నిచ్చమే పటేలా...." నాంచారి.

బుచ్చిరెడ్డి ఏం మాట్లాడలేదు కని ఆ మాట అబద్ధమని చెప్పలేకపోయాడు.

"దీస్లెకు మిరుప వరుగెంత తందో ? ధరెట్లున్నదో మావోన్ని తోల్తునా ?" నాంచారి లేచి నిలబడుతూ....

వీరయ్య, నాంచారి మరి కాసేపు మాట్లాడి బజార్లకొచ్చేసరికి పొద్దు బారెడె క్కింది....గంపలు పట్టుకొని ఆడోల్లు మొగోల్లు ఉరుకులు పరుగులు పెడుతున్నారు.

"కాయరాలిపోయినా ఫర్వాలేదుగని మూడు సవాసేర్ల కన్నా ఎక్కువియ్య మని షావుకారి, పట్వారి, బాయికాడి బాల్ రెడ్డి, సొప్పరోల్లబచ్చిరాజం అంటండ్లు." అని ఒకడు.

---

13. క్వింటల్.

"ఎందుకోనియ్యండ్లి—" అని మరొకడు అనుకుంటూ పోతున్నారు.... మూడు పానాదుల కాడ అప్పటికే యాభయరుపై మంది జమైండ్లు.

"ఇగో ఇందట్ల పద్దె తరగతోల్లు కూలోల్ల కిత్తె నట్టపోయింది లేదు....ఒకల కొకలం మద్దతిచ్చు కోవాలె....కూలోల్లు కూలీరెట్లు పెరుగాల్నని సమ్మె జేత్తే మధ్య తరగతోల్లు రైతులు మద్దతియ్యాలె—రేప మిర్చికి గిట్టుబాటు ధర గావాల్నంటె—మల్ల మనందరం పోరాడాలె—" పెంటయ్య తంటాలు పడుతూ చెప్పుకొస్తున్నాడు.

వీరయ్య, నాంచారి ఒకరి మొఖాలొకరు చూసుకున్నారు.

"పీసుకపొల్లు మాకిత్తేనే గరీబోల్లయితండ్లా? గయి దిని మేం కందలు పెత్తనమా?" స్త్రీలు గుసుస్తున్నారు....

అంతలోకే హరిజన వాడనుండి గడిపెల్లి జక్కులు ఉరికచ్చిండు—

"రాజిరెడ్డిపటేలు తోట్ల సింతకింది వాలి, తగురపుకొండి, గుద్దెంకడు ఇంకో నలుగురు పల్లె మీదోల్లు మిరుపకాయలు ఏరుతండ్లు—" అని చెప్పాడు ఎగపోస్తూ....

"ఓర్నీ! రాజిరెడ్డికేం బుట్టింది—గుంజుక రాపోండ్లె హె...." ఎవరో అనినారు....

"ఊకె పాటలు గీటలు వాడి—సందు దొరికుతే సెంగోబిల్లని గిదాసేసే నిర్వాకం....పెయ్యి ములముల పెత్తందేము అరుసుకోండ్లెహె—" ఒకడు....

ఇట్లా తలోమాట....

"ఒరే మాటలు గాదుల్లా- ముందుగాల ఆళ్ళకు నచ్చ చెప్పి తీసుకురాండ్లి .... ఆళ్ళను సూసి ఇంకొకలు మొదలుపెట్తారు...."

"మాయింట్ల నాలికకు రాసుకుందా మంటె కారం లేదు అట్లయితె నన్ను సుత ఇడుపుండ్లి —" ఓ ముసలవ్వ.

"ఎపలది గట్టుముల్లు పెద్దవ్వా! ముసలిదానివై నవు బిత్తా గిట్లేగిర పడి ఎంతెని కేసినవే—" అప్పనోల్ల రాయలింగు—

రాజిరెడ్డి తోట్ల ఏరే మనుషుల తీసుకరాను కొందరు ఉరికారు. అట్లా అందరు తలోమాట మాట్లాడుతూ ఊరుదాటి మంకోట కింది మర్రి కాడి కచ్చిండ్లు.... అప్పటికే ఎండ ముదిరింది....

కనుచూపు మేరలో ఎర్రగా పండిన మిర్చి తోటలు.... అక్కడక్కడ కోసి గూళ్లేసిన మక్కజొన్న పెరండ్లు....కొయ్యని చేండ్లు.... ఆడోల్లు గంపలు ముంద

బెట్టుకొని ముచ్చెట్లు బెట్టుకుంట తలల్ల పేండ్లు చూయించు కుంటున్నారు. మధ్య వయస్కులు ఊళ్ళోకి మర్రిచెట్టు కిందికి తిరుగుతున్నారు. ముసలివాళ్ళు చుట్టలు కాలుస్తూ తొవ్వలు చూస్తున్నారు. యువకులు 'అట్టచెమ్మ' లాడుతున్నారు.

మరికొంత సేపాగితే ఏదో ఒకటి తేలగలదని పెంటయ్య తన చుట్టూ కూర్చున్న వాళ్ళకు చెప్పుతున్నాడు....

ఎండ ముదిరింది—పడమటి దిక్కు పరుచుకున్న చెట్ల నీడలు చెట్ల కిందికి జరుగుతున్నాయి....కాని తోటల వాళ్ళు ఎవరూ అటుకేసి రాలేదు.... పట్టపగలయ్యింది....ఎవరు కబురు పంపలేదు. మరింక ఈరోజు పని సాగదని కూలోల్లు మళ్ళ ఊళ్ళె కొచ్చారు....ఈసారి కూలోల్లు నినాదాలిస్తూ వాడలు తిరిగారు....

○ ○ ○

సమ్మె మూడవనాడు విరమించబడింది....పండు కాయలు తక్కెడు యివ్వడానికి ఒప్పుకున్నారు.... పచ్చికాయలు మాత్రం ఎవరు తెంపవద్దు....ఎవరన్నా పెడితె మాత్రమే తీసుకోవాలి.... ఈ మూడు రోజుల్లోగా ఒక్క రాణిరెడ్డి తోట తప్ప మిగతా మధ్యతరగతి రైతులు ఎవరి తోటలు వాళ్ళే ఏరుకున్నారు....రాణిరెడ్డి తల్లికి, భార్యకు చెప్పి తను మాత్రం తోట ఏరే దగ్గర ఉండకుండా వరంగల్ పోయాడు....అందరితో పాటు వాళ్ళు యిచ్చి ఏరించారు....

మిర్చి ఏరడంలో ఈసారి జనం ఎన్నడు లేనంతగా తర్జన భర్జన చేశారు....

"తలకు బాసిన ఎంటిక ఏరేపున బోతేంది అనుకున్నంగని గిట్ల చేత్తడను కోలేదత్తా...." అంది సత్తెమ్మ పక్కనున్న ముసలమ్మతో....

"ఎవల కడుపుల ఏమున్నదో ఎట్ల తెలుత్తదే పిల్లా! కాలం గడిసిన కొద్ది రంగు బయట పడ్తది...." అత్త అనబడే ఆ ముసలమ్మ కాల్లు నిలేసి నిలబడి గట్టిగానే అన్నది....

"కాయ మంచి రంగుమీదనే ఉన్నది సేటుకు మంచి ధరపడ్తది" అన్నదో అయిమూలలు తెలువని పిల్ల....

"నేను ఊళ్ళోల్ల కోసం ఎన్ని ఇబ్బందులు పడ్డది ఎవలు గుర్తించలేదు.... పగోనికన్న అధ్వాన్నంగ చూత్తండ్లు....జనం ఎప్పటి దప్పుడే తన్నులు తిన్నది బోయింది—దెబ్బలు తిన్నది బోయింది ఆఖరుకత్తె నా మీదనే వియసక పడ్డరు.... జనాని కంటె ఎదో తెలువ దనుకుంటాం—పోనీ పెంటయ్యన్న ఆలోచించవద్దా....

అసలు వాలకం చూస్తే....జానెడు జీ త్తేడు లేని పొల్లగండ్లు...." రాజిరెడ్డి గత ఏడాది సంఘటనలు నెమరేసుకుంటూ తిరిగాడు....

○ ○ ○

"ఇగో పిల్ల—జెర పెయిల భయం పెట్టుకొసుండు—పందెలు పడంగ కోడి పిల్లలు గూటికత్తయ్. అగో ఆ ఉట్టిమీది తట్టల పిల్లలకొన్ని కమ్ము. జెర సంద కసువు దీసి కుండలు గడుగు—నీల్లుగిన దెచ్చేవు సుమా! బాయి మంచిగలేదు. ఇగో ఇక్కడున్నట్టత్త...." సత్తెమ్మ బిడ్డకు చెప్పి వాకిట్ల కచ్చింది. మల్లేదో మతికచ్చి "జెరంత సీకటైనంక దీపం ముట్టిచ్చి గూట్లే బెట్టు." బజాట్ల కొచ్చేసరికి భుజం మీద పుస్తకాలు బెట్టుకొని ఒక పిలగాడు దుబ్బును తన్నుకుంట ఎదురయ్యిండు. "శంకరీ మావోడేడ బోయిండు." అడిగింది. ఆ పిల్లవాడు సత్తెమ్మను ఎగాదిగా చూసి "ఎనుకత్తండ్లు—" అని చెప్పి తన దారిన తను వెళ్ళిపోయాడు. "నారిగాడేడ బోయిండో....మాతే సాతగాదవ్వా! పొల్లగండ్లు దొత్తిలకు ఆగ్గల లేకుంటయ్యిండ్లు. ఇంటి యెజమాని పట్టిచ్చుకోకపాయె—అన్నిటికి ఆడిదేం పొరసూగుతది...." గొనుక్కుంటూ నడుస్తున్నది.

"ఓ అవ్వో జెప్పన రాయె—సీకటైతె నాకు భయమైతది—" గుడిసె ముందు నిలబడి పిల్ల కేకేసి చెప్పింది.

"నిన్నేం దయ్యం ఎత్తుకపోదులే—మా అత్తపాయె" అనుకుంటనే సత్తెమ్మ ముందుకు నడిచింది.

కొంతదూరం నడిచేసరికి భూదేవి ఈతబొచ్చెలు, ఎండు పుల్లల మోపెత్తుకొని ఎదురయ్యింది. "బానే సత్తెమ్మ మీతోట ఏరింట్లానె నన్ను పిలువకనే పోతివి." అన్నది.

"ఎక్కడత్తా! మేం అందరికన్న ఎనుకబెట్టిమి — నీ కొడుకు ఆర్నెల్లు అత్తగారింట కాన్నేనాయే-" సత్తెమ్మ-

"వాల్లింట్ల పీనిగెల్ల వాళ్ళ పిత్తినా దగ్గినా పట్టుకపోయిరి. వాళ్ళ లావు సెల్లిచ్చు కుంటండ్లు....ఇంకేం జేత్తరులే.... అయినా పెంటయ్యేదేం తప్పే...." భూదేవి మోపు కిందినుండి సత్తెమ్మను పరిశీలనగా చూస్తూ....

"ఏమోనత్తా చెప్పుతె వినడు....మీదిగెల్లి దేంట్లనో ఓదాంట్ల ఏలుబెడ్తడు. అయ్యకు బుట్టిన ఆరుగురు పరమ భాగోతులేనాయె. ఓ కూడనేడా కుమ్మనేడా !

834

సంఘమో సంఘమని కాలుకు బట్టకట్టకుంట తిర్గుడేనాయె – ఎవలకు లేని సంఘం ఇతగానికే పట్టాయె-పెద్దోడు బొయ్యిమల్ల ఉగాదత్తె ఏడాది కావట్టె....ఏం తింటాండో ఏడున్నడో వాని జాడ తెలువకపాయె...." సత్తెమ్మ గొంతులో గురగుర.... కళ్ళల్లో గుబగుబ నీల్లొచ్చినయ్....

భూదేవికి కూడ కన్నీళ్ళొచ్చాయి....వెలిసిపోయిన చీరకొంగుతో చతికిన సత్తెమ్మ చెంపల మీద జారబోయె కన్నీల్లు తుడిసింది....భూదేవికి మాటలు రాలేదు. మాటలు చెప్పడానికేమున్నది ? ఎన్నైనా చెప్పచ్చు. కాని చెట్టెత్తు కొడుకును, చేతి కందిన కొడుకును కండ్ల ముంగట చూసుకోవాలని, పెండ్లిచేసి బిడ్డపాపలతోని తన కండ్ల ముంగట తిరుగాడుతుంటే చూసుకోవాలని ఏ తల్లికుండదు ?తనదా బట్టు బతుకు. తాగుబోతు మొగని తన్నులు పడలేక భూదేవి కొడుకును బట్టుకొని పది హేనేండ్ల కింద ఈ వూరొచ్చింది. దొరగారి దొడ్లె పాముకరిచి కొడుకు చని పోయిండు – ఎండిన మాను తీరుగ తను మాత్రం మిగిలింది....

"ఏడుత్తారు పిల్లా ! గుండె రాయి జేసుకోవాలె-మీరేగట్ల అదిరిపోతే నా అసొంటి దానికేమున్నది ? ఒంటికాకి తీర్గ బతుకుతలేనా ॥ మనం బిడ్డల గన్నం గనీ వాళ్ళ రాతగన్నమా ? రెక్కలచ్చిన పచ్చులాల్లు....ఎగిరిపోతరు.... సారయ్య లంగకాదు, దొంగకాదు – మందికోసం- నీ అసొంటి నా అసొంటి ఎందరి తల్లుల చేతుల్ల తిరుగుతున్నడో? సత్తెవ్వా మీ వోడు నీ వొక్కదాని కొడుకు కాదమ్మా" భూదేవి కళ్ళొత్తుకుంటూ చెప్పింది....

"పిల్లొక్కటి భయపడ్తది. తోటకాడికి పోయత్తనత్త – ఏదో ఉవ్వస....దిక్కు మల్లె బతుకుల కడుపుల సొద సెప్పుకుందామన్న కసంత తీరిక లేదాయె...." సత్తెమ్మ ముందుకు నడువబోయింది....

భూదేవికి ఏదో యాది కొచ్చి మెడలు తిక్కించి దారిపొడుగున ఎవరు రావడం లేదని రూఢీ చేసుకొని గొంతు తగ్గించి- "అపునే పిల్ల మనూల్లెకు పాటలు గీటలు నెచ్చింది గ సౌదరోల్ల పిల్లగాడేగద....మొన్న కూల్లు బెరుగాల్నంటె ఊళ్ళె పెద్ద పెద్దోల్ల పచ్చం జేరిపోయి సంగంకు ఎతిరేకం చేసిండట గద.... అందరంటె మందికి ఎటు దోత్తే అటు అంటరు-మీ యింటికచ్చి అడుగుదామను కుంటున్న" అన్నది....

"అయ్యో అత్తా నీకు గిప్పుడే ఎరికయ్యిందా? రాజిరెడ్డి దూర దూర ముంద బట్టి ఏడాదాయె....."

"సిన్న దొంగలు బడ్డ ఆర్నెల్లకు కుక్కలు మొరిగినట్టయ్యింది- పిస్సదాన్ని నాకన్ని తెలిసి సత్తయా ఏమన్ననా ? అదేంది 'సిన్నపోయి కూసున్న రాములమ్మ' పదం నాలుగేండ్ల కింద గపిలగాడు పాడంగిన్నగప్పటినుంచి గీ పిలగానికి కట్టసుకం ఎరుకున్నదనుకున్న-జాగని- ఏమచ్చిందట !"

"ఏమో అత్త ... నాతోని నీకొడుకు గయ్యన్ని మాట్లాడ్తడా ? గంత పర్సతా... అపుతల బతుకు దెరుపుండగ గిల్లతోని గీపుల్లంద లేందనుకున్నడో ఏందో ? ఏదేమైనా ఇంటి దొంగను ఈశ్వరుడైన పట్టడని- సంఘపోల్ల లాగాలన్ని దెలిసినోడు.... ఎప్పుడైతె పడకుంటచ్చిందో— రాం రాం చెప్పుకోవాలె—ముసుగుల గుద్దులాటలేంది....ముసినవా నీకు తెలువకనేపాయె...."

"కాదు మరి.... నా అసొంటి ఎడ్డెక్కలదుంటె నమ్మేసుడేనాయె— ఎట్లయిన సత్తెమ్మ ఉల్లిగడ్డంత సౌదరోడుంటె ఊరికి కీడని అంటరు గాదు. కాలానికి కరుపుకు ఆళ్ళ ముందేగాదు.... ఎక్కువ కులపోనికి కూటికి లేకపోనియ్యిగాక—మందిల గలువడు. కులం కులం ఒక్కటని మీదోల్ల తిక్కే తిరుగుతడు...."

"ఔనత్తా ఎట్లయిన ఆళ్ళ తెలివి గలోళ్లే... సంఘాలు గింగాలని ఊళ్ళకు పాటలు గీటలు తెచ్చిందాయినే.... చేసిందు కూకున్నడు—ఘడీకట్ల కానె త్తేసినట్టు ఓరకు దొలిగిండు.... పోలీసోల్లు గరీబోల్ల మీదనే పడతరు....దేంట్లనైనా ఉన్నోడు బచ్చోచే—కేసులు గీసులు చూసిండు. ఏంది గీపీకులాటని సల్లగ జారుకున్నడు. మనోల్లు మస్తైన చిక్కిండ్లు.... నిన్న మొన్నటిగ కూలీల కొన్నేనా ? మనోల్లు రానల కూకంటె అయినె సారమాపులాలు బిట్టిండు...." సత్తెమ్మ ముఖం మీది ముడతలు కదిలినయ్.... కోపంవచ్చినట్లు ఆమె మాటతీరే చెప్పుతున్నది.... అసలు రాజిరెడ్డిమీద సత్తెమ్మకు ఎప్పటినుంచో కోపం- ఆ కోపానికి కారణం సంఘ కార్యక్రమాల్లో రాజిరెడ్డి పాల్గోకపోవడం కాదు— సారామాపులా పట్టిండని కాదు. తన పెద్ద కొడుకును ఎరట దిప్పుకొని చెడగొట్టింది రాజిరెడ్డేనని గట్టి నమ్మకం....

భూదేవికి ఇంకా రాజిరెడ్డి విషయంలో నమ్మబుద్ధి కావడంలేదు. "నీ రయికంత సినికింది లచ్చుమమ్మో, పాసింది, పులిసింది దినిపోతే కక్కుదేర్గుడు బెట్టె లచ్చుమమ్మో" అని తన బతుకు గురించి సర్వం తెలిసినట్టు పాడిన మనిషిగానే రాజిరెడ్డి భూదేవి మనుసులో నిలిచిపోయిండు.

836

"చీకటయితది పోయి త్తనత్త" సత్తెమ్మ ముందుకు నడిచింది ...

మరికొంతదూరం నడిచేసరికి బుర్ర మీసాల మంగలి ఎంకటి కుంటికాలు ఎగేస్తూ ఎదురొచ్చిండు ... మంగలి ఎంకటి సాధారణంగా చెడు తెలిసిందంటే ఎవలకోవాళ్ళకు చెప్పకుండా ఉండడు.... 'ఓ సారి సైకిలు మోటర్ మీద పోతున్న దొర కొడుకును చూసి "ఇగో చిందొర టక్కర్లై సావకుంటె సూడు దొరా!' అని పెద్దదొర ముంగటనే అన్నడట - దొరకట్టే, పిచ్చికొడితే ఎడంకాలు విరిగిపోయిందని చెప్పుకుంటారు.

"ఓ సత్తెవ్వా! మీ సారయ్యను పట్టుకుంటే రెండువేల రూపాలి త్తధట గవిరిమెంటు-" అన్నడు కండ్లు పులపొడిసి వెంకటి.

"నీ ఇంట్ల పీనిగెల్ల నీ అక్కరం నోరు పడిపోను. నువ్వెందుకు ఎదురత్తివిరా ?" సత్తెమ్మ ఇంక అక్కడుంటె అలాంటి చెడు మాట లినవలసి రాగల దేమోనని గబగబ నడిచింది ...

దొరగారిల్లొచ్చింది ... ఇదే నాలుగైదేండ్ల కిందయితే ఆ యిల్లు రాంగనే ఆడోల్ల గుండె వేగంగా కొట్టుకునేది. నక్కి నక్కి గబగబ నడిచేటోల్లు. ఇప్పుడు మాత్రం గొడ్ల పెండ, రాళ్ళ రప్పలతోని పాడుబడి పోయింది. ఇంటి పెద్దరువాజ మూసున్నది. రేకు తలపుల మీద అక్కిరి బిక్కిరి రాతలు- చిరిగిన కాయిదాలు- పడిపోయిన పడారి గోడల లోపలి నుండి బంకుల్ల జాజుతో దించిన తుపాకిబొమ్మ ఏవేవో రాతలు కనిపిస్తున్నాయి. ఆ రాతలన్నిటిలో తన కొడుకు రాసినవేవో తనకు తెలువదు. కాని తనకొడుకు రాసిన రాతలు ఉన్నాయని మాత్రం తెలుసు. పడారి గోడ ఎక్కడ తెల్లగుంటే అక్కడల్లా గజిబిజిగా, వొంకర టింకరగా, ఎర్రగా, నల్లగా రాతలు ... ఎప్పుడో అంటించిన కాయిదాలు ... ఆ రాతలు చూస్తున్నప్పుడల్లా తన పెద్దకొడుకు గుండె కనిపిస్తుంది.

మూల మలుపు తిరిగేసరికి స్కూలువేపు నుండి పిల్లల అరుపులు వినిపించాయి. "మల్లపొల్ల గండ్లకేం ముంచు కచ్చిందో ? ముత్తెమంత లేని పోరగండ్లకేం ఎరుకో ? రామనేసుని కాడు నల్లారనియ్యరు.... ఏదచ్చినా ఆళ్ళకే కావాలె-" అనుకుంటూనే ఆ అరుపుల్లో తన చిన్న- కొడుకు గొంతున్నదేమోనని అలకించింది. అన్ని గొంతులు ఒక్కలాగే ఉన్నాయి.... ఏమంటున్నారో స్పష్టంగా తెలియడం లేదు.

837

కోమట్ల ఇంటి ముంగటి కొచ్చేసరికి పిల్లల గుంపు ఎదురయ్యింది. ఏమిడి ముక్కుల వాళ్ల, పిర్రలమీద వెక్కట్లు చిరిగిన వాళ్ళు, కొండిజెడల ఆడపిల్లలు-దుమ్ము రేగుతుండగా పిడికిలెత్తి గోలగోలగా అరుస్తున్నారు. ఎగురుతున్నారు. పిల్లల మధ్యలో చేతిలో నల్లటి తోలు బ్యాగుతో ముఖమంతా దుమ్ము పేరుకపోయి రాజి రెడ్డి ఆదరబాదరాగా చేతులు విసురుతూ బుడ్డరకాం[15] లాగా ఉన్నాడు.

ఆ లొల్లికి ఇండ్లల్ల నుండి ఆడోల్లు బయటకెల్లి చోద్యం చూస్తున్నారు. చింగులు దగ్గర బెట్టుకొని కోమటి సత్తెయ్య గద్దెమీద నిలుసుండి ఏదో అంటున్నాడు.... కొంచెం దూరంగ నిలుసున్న మాదిగ సుక్కమ్మ వచ్చే నవ్వును ఆపుకుంటోంది. ఎదురుంగ వచ్చే మిర్చిబండి ఆగిపోయింది. ఎడ్లు బెదురుతున్నాయి. బండెనుక మేకల మంద ఆగిపోయింది....

ఆ గుంపునుండి వోరకు తొలిగి కోమట్ల గద్దెమీద ముక్కుమీద వేలేసుకొని సత్తెమ్మ నిలుచున్నది....

"పాపం రాజిరెడ్డి పరేషానయితండు- గిదెక్కడి సోద్యమే- సత్తెమ్మ పిల్లగండ్లకు అద్దని చెప్పరాదే...." గద్దెమీద నుండి కోమటి రాధమ్మ సలహాయిచ్చింది....

"అల్ల నా మాటింటర ?" అన్నది సత్తెమ్మ.

"రాజిరెడ్డి...." తన కొడుకే చిన్నారి పిడికిలెత్తి అరుస్తున్నాడు

"డౌన్....డౌన్...." మిగతా పిల్లలు....

ఆ అరుపులకు మిర్చిబండి ఎద్దు కానెత్తేసింది.... మేకలు వెనక్కి తిరిగిపోయిన్ని ఖాతరు చేయకుండా పరుగెత్తాయి.... పనుల మీదికి పోయిన వాళ్ళు ఒక్కరొక్కరే పిల్లలు తొవ్వకడ్డంగా ఉండడంతో పోగపుతున్నారు....

"నువు పాటలు గీటలు
పాడ్తివిరో కొత్తోల్ల రాజిరెడ్డి
నువ్వు సారా మావుల
బడితివిరో సౌదరోల్ల రాజిరెడ్డి...."

కొంతమంది పిల్లలు ఎగురుతూ పాడుతున్నారు.

రాజిరెడ్డి ముఖమంతా రెచ్చిపోగా ఎవరిని కొట్టాలో తెలియక పిల్లల వెంట

838

15. హాస్యగాడు

బడి తరుముతున్నాడు.... రాజిరెడ్డి ఒక పిల్లవాని వెంటబడితె మిగతా పిల్లలు అత వెంట బడుతున్నారు. ఆ పాటలు ఎట్లా ఆపాలో తెలియడం లేదు.... ఏమి చెప్పినా వినేటట్లులేరు. అటురుక ఇటురుక. ఒళ్ళంతా చెమట పట్టింది. పిల్లలు దూరదూరంగా పరుగెత్తుతూ మళ్ళీ మూగుతున్నారు. ఒకడు అంగి గుంజుతున్నాడు. మరొకడు లాగు గుంజుతున్నడు. ఒక పిల్ల బ్యాగు గుంజింది.

సత్తెమ్మ సరిగ్గా ఇంకా ముప్పయేండ్లున్నరాని ఆ యువకుడి స్థితికి జాలి పడ్డది.... బాలవాక్కు బమ్మవాక్కని పిల్లలు అవద్దం చెప్పరు. వెనువెంటనే కోపం వచ్చింది. "పగోడు గట్ల చేసిండంటే అనుకోవచ్చు. నిన్న మొన్నటి దనుక సంగం సంగం అన్నోడే తనదారి తను సూసుకుంటె- అండ్ల దిగినోల్ల గతేం కావాలె- ఇయ్యల్ల సారల దేలినోడు రేపు ఇగో గీడుగీడు సంగం మనుషులని పట్టియ్యొచ్చు." అనుకున్నది.

పిల్లల గుంపు, రాజిరెడ్డి మూల మలుపు తిరిగారు.... బండి వెళ్ళిపోయింది. మేకల మంద వెల్లిపోయింది.... మూగిన వాళ్ళు ఎవలకు దోచినట్టు వాళ్ళు చెప్పు కుంటూ వెళ్ళిపోయారు ... ఇంకా నయం పొల్లగండ్లు తన దుకాణంమీద బల్లేదు." షావుకారికి కొత్త ఆలోచనతోచి దుకానం రెక్కనొకదాన్ని మూశాడు ...

ఆ మూల మలుపుమీదనే రాజిరెడ్డి ఇల్లు- ఆ రొల్లికి రాజిరెడ్డి భార్య పిల్ల వాన్నెత్తుకొని బయటకొచ్చింది. రాజిరెడ్డి తల్లి చేతులాడుస్తూ నోరంత తెరిచి పిల్లలను తిడుతోంది.

సత్తెమ్మ బజాట్ల కొచ్చి నడుస్తోంది. "నారిగాడు ఓరగంట తనను సూసిండు గని లెక్కన్న చెయ్యలేదు. పోరడు అగ్గెల లేకుంటయి పోతండు. 'తల్లికి బొల్లి తన ముంచె పిల్లకు సుక్కతన మత్తదట'-అయ్య దిరుగంగ కొడుకులకేమొచ్చె.... తండ్రికి చెప్పాలే...." అనుకుంటూ నడుస్తోంది సత్తెమ్మ....

అఖరిల్లు అయ్యగారిది.... పడాలి గోడకూలి, చెట్లు మొలిసున్నది. తను కాపురాని కొచ్చిన దినాలల్లో తన మొగుడు ఆయింట్లనే పాలేరుండెటోడు.... ఆ యిల్లు కలకల లాడుతూ ఉండేది.... ఎందుకో ఆ కూలిపోయిన ఇల్లు దగ్గరికి రాగానే సత్తెమ్మ నిట్టూరుస్తుంది.... ఎప్పటిలాగే బరువుగా నిట్టూర్చి ముందుకు సాగింది.... దూరంగ గౌండ్లోల్ల పానాదిల వడ్లగిర్ని సప్పుడిన పడ్తోంది.... కొద్దిగా నడిస్తే వాగు.... ఈత బొచ్చెలచ్చేదాకా వాగుల్నే నడువాలే.... చెలిమల కాడ ఆడోల్లు ముచ్చెట్లు పెడుతున్నారు....

839

ఈదులు దాటి తాళ్లల్ల కొచ్చింది. పొద్దాడు మీదినుంచి గౌండ్ల చిన్నయ్య "ఓ సత్తెక్క మాపటించి ఎటో బిరబిర పోతన్నవ్." అని అడిగిండు పెద్దగా కేకేసి ...

"తోట కాడికి పోతన్న తమ్మీ ...." అన్నది....

చిలుకలు కిలకిల మంటూ ఆకాశంలో ఎగురుతున్నాయి- ఎక్కడో ఎల్లమ్మ బోరు తాళ్ళల్ల కావచ్చు ఎవడో కొండ పొడుగు రాగం తీసి పాడుతున్నాడు... పొద్దు గూకింది.... తోటకాడికి చేరుకున్నది సత్తెమ్మ.

పెంటయ్య తోటపక్క పొలం దొయ్యలకు మోటగొట్టి- నూతిల నీళ్ళు ఒడువంగానే మోటిడిసి ఎడ్ల మూతులకు బుట్లు కట్టి మొక్క చుట్ట అంటించుకొని తాగుతున్నాడు.

"ఇగో పైరగాలి దొల్తంది. దండెడ మోట బార్లల్ల ఇడిసిపెడితె సెదలు బడ్తది- మలిసి దోనిల బెట్టాన్నావె—" అన్నాడు ఇంకో రైతు అయిలయ్య.

"నీ కెందుకురా నేను బెట్టుకుంట గదా!" పెంటయ్య

"మరైతే ఈపారికి పిటీషన్ ఏపయ్యమని అకీలుకు చెప్పేటందుకు మనిషిని తోల్దాం." అయిలయ్య ...

"ఎవలకు పుర్సతున్నది- ఎవలదోల్దాం ?" పెంటయ్య.

"అగో అదిన త్తంది-" అయిలయ్య సత్తెమ్మను చూసి పోబోయాడు.

"ఓర్నీ నువ్వు మా సత్తెమ్మకే భయపడితే సంగంల బనికిరావు సుమా!" పెంటయ్య చిన్నగా నవ్వుతూ.

సత్తెమ్మ కాలిమట్టెల చప్పుడును బట్టి కోపంగా ఉన్నట్టు గ్రహించాడు.

"నాకు ఆడోల్ల సూత్తె భయం ...." గుసగుసగా అయిలయ్య ...

"మరదలు నిన్ను ఏదురగొట్టిందిరోరే!" పెంటయ్య పెద్దగా.

"ఇంక పొద్దు గూకలేదా! ముచ్చటుంటె ఇల్లు పెండ్లాం పిల్లలు యాదొచ్చేరా! పొద్దున రాంగ చెప్పిన ఇంట్ల కారంలేదని- ఇగత్తవ్ అగత్తవని సూసి సూసి సత్తి- మారేనయ్య నానుంచి కాదు." అనుకుంటనే మిరపతోట్లకు దిగి మిరపకాయలు బరుకసాగింది.

"గిప్పుడు ఇల్లుకు పిల్లలకేమచ్చింది ?" పెంటయ్య చుట్ట కొరుక్కు ఉమ్మి లాస్తూ.

"ఏమత్తది ఏమిరాదు... పెద్దోడు దేశాలుబట్టి పోయిండు. సిన్నోడు పొల్ల గండ్ల కుప్పేసి రాజిరెడ్డిని ఆటలు పట్టించుకుంట ఊరేగుతండు. వాడు రేపో మాపో సెంగో చిల్లంటడు. కమినిష్ట ఇల్లని ఉన్నొక్కపోరిని ఎవడు సేసుకోడు ...నీకేంది? ఎవలెక్కడపోయిన సంగముంటెసాలు ..." సత్తెమ్మ కోపంగా అందామనుకున్న మాటలు దుఃఖంలోకి దిగాయి.

"జెర తాలు-తాలవమ్మా... పిస్సదానా పైరగాలి బెత్తంది. గాలి బెట్టిన దిక్కు చెట్లంగుతయి... ఓ ఆకు నేనూగ పొమ్మంటే కలుస్తాదే. మంచయినా చెడ్డయినా అందరితోని మనం. నీ వొక్కదానికేనా కష్టాలు ..." పెంటయ్య.

భార్యభర్తల మాటలు అట్ల నడువడం చూసి అయిలయ్య "గొడ్లత్తయి ఇంటికాదెవలు లేరు." జారుకోబోయాడు.

"అయిలయ్య! ఇయ్యాల్ల జెరంత కూసుండాం అట్ల వస్తవా?" పెంటయ్య...

"ఆఁ... ఆఁ" అనుకుంటనే అయిలయ్య నాలుగడుగులేశాడు.

"ఇగో జెరంత గీ ఎడ్లను గొట్టుకపోయి మట్లకుబెట్టు -" పెంటయ్య.

అయిలయ్య తిరుగొచ్చి దంచెడ దోనిలబెట్టి ఎడ్లను అదిలించుకపోయాడు.

పెంటయ్య సత్తెమ్మ దగ్గరికి వెళ్ళి తను మిరపకాయలు తెంపసాగాడు. కాసేపు గొణుగుతూ, కాసేపు కోప్పడుతూ మొత్తానికి తను చూసిన సంగతి పెంటయ్యకు చెప్పింది...

"ఎవలిడిసినా పిల్లగండ్లు వొదిలేటట్టు లేరు...గోసబుచ్చుకుంటండ్లు...ఊళ్ళె గన్పిత్తెసాలు ఎంట బడుతండ్లు..." పెంటయ్య....

ఎవరి ఆలోచనలు వాళ్ళు చేస్తూ చీకటిపడ్డ తర్వాత ఇద్దరు ఊరికేసి నడిచారు....

అయ్యగారిల్లు రాంగానే పెంటయ్య టక్కున ఆగిపోయి "రామేశ్వర్రావు మతికున్నాడే...?" అని అడిగాడు....

"నాకు దినాం ఈ తొవ్వెంట రాంగ యాదొస్తడు..." అన్నది సత్తెమ్మ

"పాత కమినిష్టల్ల పనిచేసిండు ...మాసిన్నతనంల జేల్లకుబోయిండు.... నాకు నాలుగచ్చరం ముక్కలు నేర్పింది గయినే ...కొడుకులు పట్నంలున్నరట - అయినె ఆరేండ్లకింద పోయిండట -" పెంటయ్య...

"మా చెప్పినవ్ ...." సత్తెమ్మ....

సత్తెమ్మ ముందు పెంటయ్య వెనుక నడుస్తున్నారు....

* * *

841

మిరుపతోటలు రెండవసారి ఏరడం మొదలుపెట్టారు....పెంటయ్య తోట మొదట ఏరడం పూర్తయ్యింది. ఇండ్లముంగట ఎటుచూసినా ఎర్రగా మిరుప పండ్ల రాసులే....ఊరు ఊరంతా లెక్కల్ల మునిగిపోయింది.

చింతికింద నర్సయ్య బీల్లైకుపోయి ధర కనుక్కవచ్చాడు.

ఉదయం ఇంకా పదిగంటలు కానేలేదు. పెంటయ్య, సత్తెమ్మ మిరుపపండ్లను వాకిట్లో కట్టలుగా పోస్తున్నారు. సత్తెమ్మ వచ్చే పైకంమీద కలలు కంటోంది. మిరుపకాయలు అమ్మి ఏమేమి కొనాలోనని ఆలోచిస్తోంది.

చింతికింది నర్సయ్య గడంచవాల్చుకొని కూర్చుండి - "బావా ధర మాంచి జోరుమీదున్నది. ఒకటో నంబరు కాయకు పల్లకు వెయ్యి పలుకుతుంది....ఇయ్యేడు ఏ మెల్లి నట్టులేదు కాయ మూడు పొనుక[16]లయ్యిందా ?"

"ఏడిది మూడో పొసుక నిండనే లేదు....ఇంకో రెండు పొనుకలెల్లుతది కావచ్చు - ఇయ్యేడు కర్సులు గిట్టుడే కట్టం....ఏపాటి బండ్లచ్చినయ్ బీల్లైకు ?" పెంటయ్య....

"ఎంతొచ్చిన కొద్దిలనే - పర్కాల, గరిమిండ్ల పెల్లినుంచి పది లారీలచ్చినయ్ - ఎక్కడ ఇంక పూరాగ సరుకు చేతికిరాలే."

"నాతోటే ఎసుకకయ్యిందనుకున్న -"

"ఇయ్యేడు అనలులేక అందరియి ఎసుకనే అయినై - పంట సుత్ అంతంత మాత్రమే - ముడుతరోగం, కొరుకుడురోగం ఇసురక పోయినయనుకో - మందులు కొట్టి కొట్టి సత్తిమి."

"ఏమో మనం గొంటబోయేటాల్లకు సవ్వన ధర దింపుతరేమో అడ్తీదార్లు...." పెంటయ్య లేచివచ్చి గడంచలో నర్సయ్యపక్క కూర్చుంటూ.

నర్సయ్య బీడీకట్టతీసి తనోటి ముట్టిచ్చి పెంటయ్యకొకటి యిచ్చిండు.

"ఎంత దిగినా నూరో యిన్నూరో దిగుద్ది - ఆడికి మంచి పడుతలే కదా !"

"ఏట గట్లనే అనుకుంటున్నం - గుర్రం కడుపుల గుడ్డు - ఎరువుల బత్తాలియ్యంగ, మందులమ్మంగ ఈ జిల్లల ఎన్నెకరాలు తోటలు బెట్టిండ్లో అంచన కడుతరు సేట్లు. మనం తోటల ఏరడం మొదలుపెట్టి ఒకటి అరబండ్లు రాంగనే సవ్వన ధర దెంచుతరు. ఇగ అట్ల రైతులు ఏగిరపడి ఉన్నది లేంది ఊడ్చుకపోంగనే

16. వెదురు తడుకతో అల్లినవి.

సవ్వన మూస్నూర్లు చేస్తరు....మనం ఇన్ని నీల్లు జల్లి అంటాలు గట్టుకపోతమా ? కిరాయలు బెట్టుకొని వత్తిమా ? మల్ల ఎనుకకు కొంటబోమని ధీమా ! గొడ గొడ ఏడ్సుకుంట ఆళ్ళన్నంత ధరకు ఏసత్తం...."

"ఊరూర సంగాలుబెట్టి ఊళ్ళె ఆళ్ళ ఆటలు సాగకుంటజేత్తిమి. మరిఅందర మొక్కటైతే ఏదన్న చెయ్యలేమా ?"

"ఎందుకు చెయ్యలేము...అన్ని సంఘాలు కూడబలుక్కొని గిట్టుబాటు ధరల గురించి కొట్లాడాలె...."

ఇట్లా కాసేపు మాట్లాడుకున్నారు -

"ముండ బొడ్డికి దండంబెడితె నాతీరు గుండుమని దీవెన బెట్టిందట - మీబావ కన్నీ అనుమానాలే - ఏర్గబోను ఏడుగునాత్తాలు[17] జేత్తడు. గీన్‌తోనేందన్నా బజా రంనాడు కాయలు కొండబోదాం." అన్నది సత్తెమ్మ - మల్ల కొట్లాట గిట్లాట అంటుండు - కాయలీడబెట్టి తిరుగుతడేమొనసుకొని.

"జా బావా ! రాణిరెడ్డి సంగతేమన్న తెల్సిందా ? బాల సంఘపోల్లు ఇజ్జత్ తీత్తండ్లు గదా ! ఏనాడామె మనకు దూరముయ్య ఇంకోడైతే ఊకుందురా ! పంచాతు బెట్టి మీకు మాకు రాం రాం అని చెప్పకపోదురా ! ఎంతైనా సదువుకున్నోడు సదువు కున్నోడే ...కిందబడ్డా ఒంపోతే మీదబడ్డా ఒంపోతే." నర్సయ్య గుసగుసగా అన్నాడు.

"మనకు చెరుపు దెచ్చేదనుక చూద్దాం." పెంటయ్య....

"బాగున్నది పని వరుస .. సంగపెద్దవు నువ్వే గిట్లంటెట్ల ? దొంగలుబడ్డ అర్నెల్లకు మనం కండ్లు తెరిత్తెట్ల....చెరుపు ఎంత తెత్తడో ఎవలెరుక - ఇగో గిట్ల ఇడిసిపెడితె ఒక్కొక్కడు గట్లనే ఎల్లిపోయి సంగంపేరు చెప్పుకొని దందాలు చేత్తరు. పట్లిక్కేమొ ఎవడు మనోడో ఎవడు మందోడో తెలియదు. అయింక మనం సికుల్ల బడ్తం. ఇగో రాణిరెడ్డికి పెద్ద పెద్దోల్లతోనే సోపతి - మనదెంత కోన్‌కిస్కేగాళ్ళం." కండ్లు పులపొడిసి నర్సయ్య అన్నాడు.

"అంటె...."

17. విచారాలు.

"కోప్పడకు బావా! పార్టోల్లు రాణిరెడ్డికి ముందుగాతెలుక - మనకు ఎనుక - మనకన్న రాణిరెడ్డికే ఎక్కువ...."

"అయితే...." వెంకయ్య నోరుతెరిచి.

"ఏమో లోపటి చిక్కులు నాకే మెరుక - సంకలేవడితె ఖర్జం కండ్ల బడ్తది - ఎటన్నా తిప్పలే - నలుగురితోని నారాయణ. ఊళ్లోల్లు మాత్రం - రాణి రెడ్డిని ఎందకంటె నిలదీత్తలేరని పిసపిస లాడుతండ్లు...." నర్సయ్య లేచి వెళ్ళిపో బోతూ....

"నా మనుసుల మాట చెప్పిన....నాకన్న నీకు ఎక్కువదెలుసు - విచారం చెయ్యి -" అని చెప్పిపోయాడు.

వెంకయ్య ఆలోచనలో పడ్డాడు.... ఎవరో ఒకరు ఇలాంటివి చెప్పుతూనే వున్నారు.... నిజానికి ఈ మాటలన్నీ పార్టీకి వీలైనప్పుడల్లా తెలుపుతూనే ఉన్నాడు. పని తీరకనో మరెందు చేతనో వాళ్ళు తేల్చి చెప్పడం లేదు.... నర్సయ్య అన్న ట్లుగా రాణిరెడ్డి మీద పార్టీ వాళ్ళకు ఏమన్న ప్రత్యేక శ్రద్ధ ఉన్నదా? మారే వాళ్ళకు ఏ ఒక్కడు ముఖ్యంకాదు.... అట్లైందు కైతది ... ఎద్దెగురంగనే గంపెగురుతదా?" వెంకయ్య ఆలోచనలు పరిపరి విధాల పోయినయ్.... "మారే వాళ్ళు అట్లా చేయరు" అనుకొని సమాధాన పడ్డాడు.

× × ×

సారా మామూలా మిత్రులు సాయిరెడ్డి, కమలాకర్, రాణిరెడ్డి బస్సుదిగి బార్ అండ్ రెస్టారెంట్ల సంగతి కులాసాగా మాట్లాడుకుంటూ వస్తున్నారు.... ఆ యిద్దరు కూడా పాతకాలంలో పోరాటంలో తిరిగిన వాళ్ళే.... సాయిరెడ్డిది కరీంనగర్ జిల్లా.. ఒకప్పుడు ఆయన పేరు చెప్పితే దొరలకు గుండె లాగేటియి.... దళంల పొమ్మన్న రని, తను చెప్పింది వినలేదని, బయటకు చెప్పుతడు- లోపల మిత్రులతో మాత్రం "నిన్న మొన్నటి బచ్చెగాళ్ళకు జిల్లా కమిటిలో స్థానమిచ్చిండ్లు- తనను మాత్రం ఆర్గనైజర్ స్థాయిలనే ఉండుమన్నరు." అని గుసగుసగా చెప్పుతడు.... అసలు కారణం మాత్రము- ఒకటి రెండు ఎన్‌కౌంటర్లు జరిగి ప్రాణంమీద తీపి పెరిగి వచ్చే సిండు.... ఎంత హీరోయిక్‌గా పోరాటంల పాల్గొన్నడో అంతే హీరోయిక్‌గా పాత కాలపు సారా కంట్రాక్టర్లను కాదని మామూలా బట్టిండు. మాజీలనందర్ని కుప్పేసు

844

కున్నాడు. తను పార్టీమీద పెట్టిన విమర్శకు మద్దతుండాలి గదా.... ఇంకోటి ఏది చేసినా ఈ మాజీలే చేయగలరని నమ్మిక.

కమలాకర్‌కు సాయుధ పోరాటం మీద నమ్మకం పోయింది- ఆయనకు బోలెడన్ని ఆలోచనలున్నాయి. జరిగే పోరాటం ఇట్లా కాదని గంటల తరబడి చెప్ప గలడు. కాని నువ్వేం చేయగలవో? చెప్పమంటె మాత్రం నక్కిళ్లు దగ్గర పడు తాయి. రాజకీయంగానే విభేదాలున్నాయని బాహాటంగానే చెప్పక తిరుగుతున్నాడు.... ఎట్లాగైన ఒక లక్ష పోగేసి- మిగతా పార్టనర్సును కలుపుకొని తన అభిప్రాయాల కనుగుణంగా మంచి విప్లవ సినిమా తీయాలని, తద్వారా రచయితగా కూడా పరి చయం కావాలని పెద్ద ఆలోచనే ఉన్నది....

మరింక రాజిరెడ్డి ఇంకా అలాంటి పెద్దపెద్ద ఆలోచనలేం లేకున్న- కేసుల నుండి బయటపడి మొత్తానికి భద్ర జీవితం గడపాలని ఉన్నది.... అతను కొత్తగా వ్యాపారంలోకి వచ్చినవాడు.... డబ్బులు చేతిలో కొస్తే ఏమేమి చేయగలడో అత నింకా ఆలోచించలేదు....

ముగ్గురు కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నారు. పొద్దు గూకడానికి సిద్ధంగా ఉన్నది.... అసలు వాళ్ళిద్దర్ని ఊళ్లెకు తీసుకరావడం రాజిరెడ్డికి ఇష్టం లేదు.... తాళ్ళకింది నుండి నడుస్తూ ఊరు దగ్గెర పడుతున్న కొద్ది రాజిరెడ్డి గుండె వేగంగా కొట్టుకోసాగింది.... స్కూలు దగ్గరికి వచ్చేసరికి బుగులు బుగులుగానే ఉన్నది. మామూలుగానైతే ఈపాటికి పిల్లలు స్కూలు ముందట ఆడుకుంట ఉండే టోల్లు- లేరంటే గండం గడిచినట్లే-

"ఇయ్యేడు ఎంత లేదన్న లక్షరూపాయలుంటయి." సాయిరెడ్డి ముక్కుల నుండి సిగరెట్టు పొగ వొదులుతూ- ఎడంచేతిలో గోల్డుప్లేకు సిగరెట్టు పెట్టె టకటక లాడిస్తూ....

అంతకన్న ఎక్కువే ఉండగలదని కమలాకర్‌కు తెలుసు.... అయినా "ఇంక మామూలా పిరియడ్ పూర్తికాందే లెక్కలు పెట్టడం ఏమంత మంచిది కాదు" అన్నాడు.... వంగి బూట్లమీద దుమ్ము దులుపుకుంటూ.... "జీబు తెచ్చుకుంటె- బాగుండేది-" అన్నాడు....

రాజిరెడ్డి లాభాల గురించి ఆలోచించడం లేదు. పిల్లల గురించే సందులు గొందులు చూస్తున్నాడు-

845

"సుప్వేపుంటవ్...." సాయిరెడ్డి రాజిరెడ్డినడిగాడు.

"ఆఁ వాళ్ళతోనేంది ?...." అన్నాడు పరధ్యానంగా.

"మనోనికి పార్టోల్ల పిరికి పోనట్టున్నది...." ఇద్దరు గట్టిగా నవ్వుతూ అన్నారు....

"మాటల్ల డెమొక్రటిక్ సెంట్రలిజం అంటరు. చేతల్ల మాత్రం మీదికెల్లి రుద్దుడే...." కమలాకర్ పార్టీ విషయం రాగానే విమర్శ మొదలేశాడు ...

"వాళ్ళంటే బాగానే ఉండు.... లెనిన్, మావో అన్నరని చెప్తరు గదా...." సాయిరెడ్డి....

రాజిరెడ్డికి ఈ సంభాషణ నచ్చలేదు.... "ఇగో మనమెందుకు మనకు సాతగాక వచ్చినం ... చేసేటోల్ల మీద దుమ్మెత్తి పొయ్యటం- దేనికి?" అన్నాడు మెల్లగా....

"అంటే పార్టీ అంటె మాకు నమ్మకం లేదనా ? పార్టీ ప్రజలకోసం పని చేస్తున్నప్పుడు మంచి చెడ్డలు విచారం చెయ్యటానికి అందరికీ హక్కున్నది." కమలాకర్ ....

ఇంతలోనే ఊరొచ్చింది. మూల మలుపు దగ్గర ఎవడో కాల్లదాకా లొడ లొడ అంగీ వేసుకున్న బోడగుండు పోరడు ఎక్కిరిచ్చి ఉరికిండు ... మిత్రులిద్దరు అది చూశారు.

"బచ్చేగాడు వెక్కిరిస్తండేంది ?" సాయిరెడ్డి-

"తీట పోరగండ్లు-" అన్నాడు రాజిరెడ్డి-

కమలాకర్ గోడలమీది రాతలు చదువుతూ నడుస్తున్నాడు. "సాయుధ పోరాటమే ఏకైక మార్గం", "తుపాకి గొట్టం ద్వారానే రాజ్యాధికారం వస్తుంది", "దున్నేవానికే భూమి-" "రష్యన్ సోషల్ సామ్రాజ్యవాదం నశించాలి". అని చదివి.... "అబ్బ మీవోక్క ఊళ్ళె రైతులకు కావాల్సిన స్లోగన్ చూసిన.... అవ్వన్ని రైతులకు తెలుస్తయా ?"

"మనోడికి తుపాకంటేనే గుండెదడ-" అన్నాడు సాయిరెడ్డి నవ్వుతూ....

మరోచోట పెద్దగా వంకర టింకరగా రాసిన బొగ్గురాతలు "రాజిరెడ్డి డౌన్... డౌన్...." కమలాకర్ పెద్దగా చదివి- "అయితే నీమీద కూడ దాడి మొదలయ్యిందన్నమాట-" "రాజిరెడ్డీ ! మన మీద కరపత్రం తీస్తరటగద...." అన్నాడు....

"అవార పోరగండ్లు" సంజాయిషిగా ఏదో చెప్పబోయాడు రాజిరెడ్డి- సాయిరెడ్డి కరపత్రం సంగతి విని మాట్లాడలేదు....

846

ఇంతలోనే రాజిరెడ్డి ఇల్లొచ్చింది.... రేకు పొటకులు తెరిచున్నాయి....లోపల గోడల మీద ఎక్కడా సందులేకుండ అల్లిబిల్లి రాతలు. 'రాజిరెడ్డి దొంగ, రాజిరెడ్డి లంగ' ఒకే సంగాన్ని పైసల కమ్ముకోకు ఇట్లు "బాలసంఘం". ఇట్లాంటివే చాలా రాతలున్నాయి. రాజిరెడ్డి ముఖం తెల్లగా పాలిపోయింది....

నవ్వు తెచ్చిపెట్టుకుంటూ.... "కూర్చోండ్లి"- రెండు ఆరాము కుర్చీలు తెచ్చేలోడు.... ఆ రాతలు చూచేసరికి కమలాకర్‌కు, శాయిరెడ్డికి మతిపోయింది....

ఇల్లు నిశ్శబ్దంగా ఉంది. ఏదో జరిగిందని రాజిరెడ్డి ఊహించాడు. "అమ్మా" అనుకుంటూ లోపలికి పోయాడు. లోపల భార్య పిల్లవాన్ని పడుకోబెడుతుంది. ఆమె కండ్లు ఉబ్బి ఉన్నాయి....

"ఇగో మా దోస్తులొచ్చిండ్లు.... అమ్మేది...." అన్నాడు రాజిరెడ్డి సాధ్యమైనంత మృదువుగా....

"ఏందెచ్చిండ్లు మీ దోస్తులు.... నీకేంది మారాజువు? ఊళ్లె వాళ్లను తప్పించుకోను ఏడికన్న బోతవు. ఊరిపోరగండ్లంతా ఇంటిమీదికొచ్చి ఎంత లొల్లి చేసిండ్లు?"- సుగుణకు దుఃఖం ముంచుకొచ్చింది....

"పొల్లగండ్ల ఏం చేసేటట్టు లేదు...." రాజిరెడ్డి గొణిగిండు.

"మరింక నీ యిష్టం- నన్ను మా అమ్మ వాళ్లింటికాడ వొదిలిపెట్టు- మీ అమ్మ తోటి కాడుంటది- నేను ఇంట్ల ఒక్కదాన్ని బయటికి కాలుపెట్టక నెలరోజులయ్యింది. ఊళ్లె ఎవలు మాట్లాడ్తలేరు...." ఇంకా వెక్కుతూనే....

"సరె సరె! కానియ్యి. ఏదో ఒకటి చేద్దాం. బయట మా మామూలా వాళ్లున్నరు."

"ఉంటేంది.... ఉండనియ్యి. ఊళ్లెకు ఉప్పుకు గొరకాకుంటయ్యింది. బయట పరువు గావాల్నా- అదె ముందుగనే ఈ బుద్ధుంటే బాగుండు గదా! నిన్నెవలు సంగమో సంగమని తిరుగుమన్నరు? తిరిగినోనివి మద్దెల ఎవలు ఎల్లి పొమ్మన్నరు. సాకల్లానికి నుత్ అలుసైపోయింది- "మన్నులందర్ని దంగల్ల దించి తను దొంగల్ల కలిసిండు" అని ముఖం మీదనే అనబట్టె సుగుణ గట్టిగానే అన్నది.

"జర మెల్లెగ మాట్లాడవే" రాజిరెడ్డి పండ్లు బిగపట్టి అన్నాడు.

"ఏంది మెల్లెగ మాట్లాడేది- నీ పరువు గోడల మీద కన్పత్త లేదా?"

రాజిరెడ్డికి అట్ల కోపమొచ్చింది. జాడిచ్చి సుగుణ చెంపమీద కొట్టాడు....

సుగుణ నిశ్చేష్టురాలయ్యింది.... ఆఖరుకు అన్ని కబుర్లు చెప్పిన తన భర్త ఇంతకు దిగజారగలడని నమ్మలేకపోతోంది.... ఆడోల్లు, హక్కులు, పోరాటం అని చెప్పిన భర్త తనను కొట్టిండు....

"కమినిస్టులు భార్యను కొట్టిండ్లు గదా! పెండ్లాన్ని గన్క కొట్టో తన్నో ఆఖరుకు మెడలు పిసికో నోరు మూయించుతరు. అంతలావు రోషమున్నోనివైతే మంది నోరు మూయించు–నీ దోస్తులనే అడుగుత పా– గింత మాటకు కొట్టుమంట రేమె ?" సుగుణ ఏడుస్తూ బయటకు రాబోయింది. ఆగడబిడకు పిల్లవాడు లేచి ఏడ్వసాగిండు.

రాణిరెడ్డికి నిజంగానే మతిపోయింది. ఏం చేయాలో తోచలేదు. ఆదర బాదరగా బయటకొచ్చాడు....కుర్చీలు ఖాళీగా ఉన్నాయి. అప్పటికే మిత్రులిద్దరు పరిస్థితి బాగాలేదని తిరుగు ప్రయాణమయ్యారు.

రాణిరెడ్డికి చాతకాని కోపం హెచ్చింది. మళ్ళ కాళ్ళ బాదుతూ లోపలికురికి సుగుణను జడపట్టి దబడ దిబడ బాదిండు. సుగుణ ఎదురు తిరిగింది. రాణిరెడ్డిని బయటకు గెంటి తలుపు పెట్టుకున్నది.

కోపంతో పండ్లు కొరుకుతూ బయట కొచ్చాడు. అప్పటికే వీధి దీపాలు వెలిగినయ్. పెద్ద పెద్ద అంగలేస్తూ బజార్లో నడుస్తున్నాడు.... చేలదగ్గరి నుండి, తోటల దగ్గరినుండి వచ్చే జనం, పోయే జనం ఓరకంట రాణిరెడ్డిని గమనిస్తూ పోతున్నారు....

"తొండ బిర్రు ఎనుగులదాకా" ఎవడో మక్కజొన్న కర్రల కిందినుండి తల ఊతల బెట్టి అన్నాడు.

"బొర్రా.... తొండ బిర్రు ఎనుగులదాకనే– మీ అందరికి కండ్లు నెత్తి కెక్కినయ్. మన్నుదిన్న మంజేరుగున్నలోలే పడుంటే బాంచెన్ బాంచెనని తన్నినా గుద్దినా పడుంటే మీమ్మలందరిని కుప్పేసి సంఘం బెట్టి-కూలీలు పెంచిపిచ్చింది– తకరారు భూములిప్పిచ్చింది నా తప్పే.... పోలీసులు ఊరిమీదపడి తన్నుతాంటే చెట్లు పుట్టలు బట్టి ఉరికిండ్లు-గప్పుడు నేనన్ననా ? పరంపోగులు దున్నిచ్చింది బోయింది- ఇప్పటికి కేసుల చుట్టు పుచ్చిన కుక్క తీర్గ తిర్గిస త్తన్న – ఇండ్లల్ల కాకుండి కోరగండ్లను నా యింటిమీదికి ఉసిగొల్పి సోద్యం చూ స్తండ్లు- ఎంతదాక చేస్తరో నేను చూ స్త..." రాణిరెడ్డి మాటకు మాట పొంతన లేకుండా నసురుతూ బస్సు స్టేజీ దగ్గరికి నడిచాడు.

రాజిరెడ్డి స్టేజీ దగ్గరికి చేరుకోవడం, బస్సురావడం ఒక్కపారే జరిగింది.... ఇద్దరు మిత్రులు బస్సెక్కి "బాధపడకు రాజన్నా....మల్లెప్పుడన్న వస్తం".... అన్నాడు సాయిరెడ్డి....

ఇప్పుడు ఇద్దరిని తీసుకచ్చి కూడా చేసేదేమిలేదు. రాజిరెడ్డి చప్పుడు చేయ లేదు. బస్సెక్కి తను వాళ్ళతోపాటు పోదామా అనుకున్నాడు....ఎందుకో పోబుద్ధి కాలేదు....

బస్సు కదిలింది....రాజిరెడ్డి ఒక్కడే మిగిలాడు....మనుసింకా కుతకుత ఉడుకుతూనే ఉన్నది. ఎన్నాదినుండి మసిలి మసిలి మరింక మసుగులో గుద్దులాడ లుండొద్దు—ఎక్కడో ఒక దగ్గర గండి కొట్టాలి.... ఈ సూటిపోటి మాటలేంది? ఈ కోర చూపులు వొద్దు....ఇల్లె ఉండు మంటరో లేదో తేల్చుకోవాలె—జిట్టెడు లేని పొల్లగండ్లు ఎంత బడుదేంది? నేను లేకుంట చూసి ఇంటిమీద దాడి చేసుడేంది ? ఈ బాలసంఘం పెట్టింది తను.... తన మీదికే పోరగండ్లు ఉల్టాతిరిగిండ్లు- అటుబోతే అమీనుగాడు వాడెరికేనా వీడెరికేనా అని అడుగుతడు. మూడు కేసులు అట్లాగే ఉన్నాయి. పోనీ పార్టీకేమన్న ద్రోహం చేసి పోతిమా ? చాతనైనంత చేసిన.... మరింక చాతకాదంటే వినరే....ఏదో ఒకటి చెయ్యాలెగన్క సారా బిజినెస్‌ల దిగిన ....రాజిరెడ్డి తనలో తానే తర్కించుకుంటూ నడుస్తున్నాడు.

పందిల్లకింద, గుడిసెల చూర్లకింద కూచ్చున్న జనం ఏదో చెప్పుకుంటు న్నారు. ఆ మాటలేమిటో స్పష్టంగా విన్పించడంలేదు. కాని తన గురించే చెప్పు కుంటున్నారని అనుకున్నాడు. "వీళ్ళకేం తెలుసు మార్క్సిజం-ఇయ్యల్ల అందరు మొనగాల్లే అయ్యిండ్లు-రాజిరెడ్డి దొంగయ్యిండు. రాజిరెడ్డి త్యాగాలు పోయినయ్- రాజిరెడ్డి తిన్న తన్నులు పోయినయ్.... జనం స్వార్థపరులు.... వాళ్ళ ఘాసుల కోసం రాత్రనక పగలనక తిరిగింది పోయింది....

జనం సంగతట్లా ఉంచితే నాయకులో....పిల్లలను పిలిచి రాజిరెడ్డి మనోడేనని కోప్పడవద్దా—ఇంతకు వాళ్ల ఏమనుకుంటున్నారు ? తను శత్రువ నను కొంటుండ్లా? మిత్రుడనా ? ఇయ్యల్ల అదో యిదో తేల్చుకోవల్సిందే.... అంతవరదాకా గమ్యం లేకుండ నడుస్తున్న రాజిరెడ్డి ఆ ఆలోచన కలుంగానే పెంటయ్యఇంటికేసి నడిచాడు ...

వాకిట్లో నిలబడి "పెంటయ్యా.... పెంటయ్యా...." అని గట్టిగా పిలిచాడు.

849

బువ్వ తింటున్న పెంటయ్య ఎంగిలి చేతితోనే లేచి వచ్చిండు. వాకిట్లో నీళ

లైటు వెలుతురులో పరేషాన్లో ఉన్న రాజిరెడ్డి ముఖంచూసి "రా లోపలికిరా...." అన్నాడు పెంటయ్య.

"వచ్చేదేంది....గని ఇగో పెంటయ్య మీకు నాకు రాంరాం మంచో చెడ్డో...." రాజిరెడ్డి ఆదర బాదరగా ఏవో చెప్పబోయాడు.

"ఏందా గావర.... జెరలోపటికచ్చి మాట్లాడుడు-" పెంటయ్య చెయ్యి కడు క్కొంచుకొని....

"లక్ష మాటలేంది. మనూరు బాగు పడాలని నా సాతనైనంత చేసిన. నాకిప్పుడు సాతనైతలేదు. నా దారి నేను చూసుకున్న" రాజిరెడ్డి పందిరి కిందకొచ్చి.

సత్తెమ్మ, పిల్లలు వచ్చారు. పిల్లవాడు తల్లిచాటుకు నిలబడి గుడ్లు మిటకరిచ్చి చూస్తున్నాడు.

"ఊరు బాగు పడ్డదా ? ఇయ్యాల్ల మల్ల నోటీసులచ్చినయ్....పరంపోగులు, కారడ్ కిత్తాలు దొర పట్టినట.... అస్లు వరంగల్లులుంచి బిస తిప్పుతండ్లు....మీకు తెలువని దేమున్నది?.... పోలీసోల్లు పొద్దందాకా వచ్చి పోసే బట్టిరి...." దీర్ఘంగా నిట్టూర్చి "రోక్లై తలబెట్టి రోకటి పోట్లకు భయపడ్తమా- తమరిని కాదన్నదెవలు?" అన్నాడు పెంటయ్య.

"ఇగో రాజకీయాలు నాకు నేర్పకుండ్లి నేను-గిసొంటి సంగాలు లక్ష తొంబయి చూసిన...."

"గిప్పుడు గంత పెద్ద మాటలెందుకు ?"

"బానయ్యా ! మీకేంది అంత మంచిగానే ఉన్నరు....పొల్లగండ్ల ఉసిగొల్పి సోద్యం చూస్తున్నారు."

"వాళ్ళకు నేర్పింది తమరే కదా ?"

"ఏం నేర్పిన ?" రాజిరెడ్డి రోషంగా అన్నాడు.

"ఏం నేర్పింల్లా ? పురుగు బుట్టితిని పుట్టలుండే పొల్లగండ్ల కుప్పేసి పదాలు నేర్పితిరి- మా పెద్దోడు చేతికంద కుంటాడా- అందరు ఉస్కో అంటే ఉస్కో అని మీరు సల్లగ జారుకుంటిరి.... మేం మీయింటిమీద కొచ్చి అడిగినమా?" సత్తెమ్మ.

"నువ్వూకోరాదే.... సందు దొర్కుతెసాలు.... మన పెద్దోడు తనకేది మంచో అదే సూసుకున్నడు" పెంటయ్య.

"అటిగాదు నేను వర్గ శత్రువునా ?" రాజిరెడ్డి సూటిగా అడిగిండు.

పెంటయ్య తల వాల్చుకున్నాడు....

"చెప్పు పెంటయ్య చెప్పు— ఏదో తేల్చి చెప్పు— ఇయ్యాల్ల మా యింటి మీదికొచ్చి గోడలన్ని రాసిపోయిండ్లు."

"నాకు గంత పెద్దమాట లెరికలే— అంతకు ముందు దొరలు సెల్లిచ్చుకున్నరు. భూములు నాగలు గుంజుకున్నరు. ఇష్టా రాజ్యం చేసిండ్లు— కడుపుల సొద ఆగనోడు మర్లబడ్డడు. ఒంటిగాని సేత ఇంటికి రాదని దొరలు అసొంటోన్ని తన్నిండ్లు గుద్దిండ్లు— అఖరుకు సంపి బొంద బెట్టిండ్లు. అన్ని ఊళ్ళల్ల కలిసిపోయినట్టుగానే మనూళ్లె తన్నులు గుద్దులు తినోళ్లు కల్సిపోయిండ్లు.... మీరు మమ్ముల నిరుటి దనుక నడిపిచ్చిండ్లు. దొరలు వరంగల్ పారిపోయి సందువొరికిత్తె మల్ల ఊల్లెకిచ్చి రాజ్జేమేలుదామని కలలు కంటండ్లు.... కేసులు ఊళ్ళోల్లమీద నడుత్తనే ఉన్నయి. మమ్ముల నడిపించవల్సినోల్లు మీరు పక్కకు జరిగిండ్లు- అది మంచో చెడో? నష్టమేందో కష్టమేందో మాకన్న మీకే ఎక్కువ తెలువాలె- సరే తమరు నష్టం జరుగలేదంటండ్లు-సంగమున్నది. సంగాన్ని బెట్టింది మీరు-సంగాన్ని కుప్పజేసి చెప్పుండ్లి —"

"నేను బెట్టిన సంఘమే నన్ను విచారణ చేస్తదన్నమాట"

"ఎవరికైన గంతేనని తమరే చెప్పితిరి గదా! మనండ్ల మనం...."

"గీ నీతి మాటలు నాకు నీకన్న ఎక్కువే తెలుసు. అందరి సంగతి నాకెరికే. నేను సంగమే కాదు పార్టీ అంటే ఏమిటో ఎరుగుదును." రాజిరెడ్డి వెనుకకు తిరిగి సరసరి వెళ్ళిపోయాడు....

పెంటయ్య రాజిరెడ్డి మాటల గురించి ఆలోచిస్తూ నిలుచుండిపోయాడు.... సత్తెమ్మకు కోపం వచ్చింది....

"నేనే మాదండి మొగోన్నని ఎగురుతండు. అట్లబెల్లం గొట్టిన రాయోలె నాన్నుకుంట నిలుసుంటవేంది— ఖాఖండిగ చెప్పద్దా ?" అన్నది....

"ఏగిరపడ్తె అయితాదే....మనం ఏగిరపడి ఏగిరపడే గీడకచ్చినం....విసారం చేయాలే— అయినా రాజిరెడ్డి బయటుండి ఏదన్నా మాట్లాడ్తడు...." అన్నాడు....

రాజిరెడ్డి ఇవ్వాళ్ళ జరిగిన సంగతలన్ని మరిచిపోవాలనుకున్నాడు. ఎక్కడో ఒక దగ్గర కుదురుగా కూర్చుంటే ఆలోచనలు వెంటాడుతాయని ఒంటరిగా చేతు

851

లూపుతూ ఎవరకేసి చూడకుండా తిరిగాడు....వీధిలైట్ల కింది నుండి నడుస్తున్నప్పుడు పొడుపుగా పడ్డ తన నీడను తనే వింతగా చూసుకున్నాడు. గుబురు చింతల కింద నిలబడి చిమ్మెట్లు పలకడం విన్నాడు....పక్క కుదురక అప్పుడోపిట్ట ఇప్పుడోపిట్ట అరవడం విన్నాడు....బడి ముందుకు నడిచి పిల్లలు ఆడుకునే ఇసుక కుప్పమీద కాసేపు వెల్లకిలాపన్నాడు. ఆకాశంలో చుక్కలు....తేటతేటగా ఆకాశం. పసివాడి నవ్వులా లేతలేత వెన్నెల....హఠాత్తుగా తన కొడుకు ముఖం గుర్తొచ్చింది....తను ఎత్తుకోక పదిహేను రోజులైంది....సుగుణ ముఖం యాదొచ్చింది....వద్దు వద్దు.... టక్కున లేచి నిలబడి జేబుల్లో చేతులు పెట్టుకొని గొడ్లకొట్టం కాడికి నడిచాడు.... గొడ్లకొట్టం చీకటిగా, నిశ్శబ్దంగా ఉన్నది....దోమలను తోలుకోవడానికి అప్పుడప్పుడు చెవులు లొటలొట కొట్టుకుంటున్నాయి గొడ్లు....నెమరేసే చప్పుడు.... గడంచలో మోకాళ్ళ మధ్య తల ఇరికించుకొని కూర్చున్నాడు.... హరిజనవాడలో కోలాటమేస్తున్నట్లున్నది....అస్పష్టంగా పాటలు విన్పిస్తున్నాయి. మూడు పానాదుల కాడ కావోలు పిల్లలు ఏదో ఆడుతూ పాడుతున్నారు....రేపటికి తిండికి లేకున్నా— భయంకరమైన సమస్యలున్నా ఊరంతా ఈ రాత్రి సంతోషంగానే ఉన్నది.... తానొక్కడే చావుకన్న భయంకరమైన చిత్రహింస ననుభవిస్తున్నాడు— ఎమర్జెన్సీ రోజుల్లో గోళ్ళల్ల సూదులు గుచ్చడం కన్నా! అర్థరాత్రి మాంచి నిద్రలో లేపి ఎద్దు ముఖపు ఆఫీసర్ల ఇంటరాగేషన్ కన్నా! ఈ స్థితి క్రూరంగా, ఘోరంగా ఉన్నది....ఇంటికి పోదామనుకున్నాడు. ఏడిచే సుగుణ ముఖం, ముడుతలు బడ్డ అమ్మ ముఖం గుర్తొచ్చాయి. ఈ దేశంలో ముప్పయి కోట్ల మంది స్త్రీలు ఎందుకు కొరగాకుండా హరిజనుల కన్నా హీనంగా బతుకుతున్నారని....ఇంట్లో అలంకార వస్తువుగా తప్ప మనుషులుగా చూడబడడం లేదని— మొగవాడి దౌర్జన్యం కింద నలిగిపోతున్నారని సుగుణకు తను ఎన్నోసార్లు చెప్పాడు. కళ్ళు మూతలు పడిపోకుంటే సుగుణను లేపి కూర్చుండబెట్టి కథలు చదివి విన్పించాడు....కాని ఇవ్వాళ్ళ ఉత్తుత్తగానే కొట్టాడు....నిజానికి ఆ కోపం దాతకానిదే—పిల్లలు ఇంటిమీదికొచ్చి అల్లరి చేశారని వాళ్ళమీద కోపం సుగుణ మీద లేశాడు....పిల్లలకేమొచ్చింది? నిజానికి పిల్లలు అమాయకులు....వాళ్ళ ముఖాలల్లో, చేతల్లో మంచి చెడు స్పష్టంగా ప్రతిఫలిస్తుంటాయి....తనే ఇంకోసారైతే— అది తనమీదనే కాకుంటే—పిల్లల పనికి అభినందించే వాడు....డబ్బు, వ్యాపారం....నిజానికి తను వెనుక బడ్డాడు. అరెస్టులు, సోదాలు,

852

కేసులు తనను కుంగదీశాయి.... ఇంత దూరం వచ్చిన తరువాత వెనక్కి తగ్గడం తన తప్పే—అంతో యింతో సమాజం గురించి తెలిసినవాడే ఇట్లయితే ప్రజల మాటో! పోనీ ఇంతయినంక ప్రజల ముందుకు ఏ ముఖం పెట్టుకొని పోవడం.... పోయినా ఏకీలుకాకీలు విమర్శపెడుతరు. మొగమాటలు, నంగి మాటలుండవు. కుండ బద్దలు కొట్టినట్లు మొకం మీదనే అనేస్తరు....పోనీ ఈ బతుకులో తనెంత కాలం సుఖపడగలడు. వనమిడిసిన కోతి లాగయిపోతుంది. ఎన్ని వేషాలేసినా ఊళ్ళల్లో ఏది జరిగినా తనను పట్టుక పోవడం ఖాయం....సంఘం తన కోసం ఏదన్నా చేయకుండా ఊరుకుంటుందా? అసలోడు దొరుకకపోతే తన మీదనే కేసులు పెడుతరు.... ఎవడి మీద కేసులు పెడుతున్నామనే ఆలోచన పోలీసుల కుండదు. కేసు కావాలె అంతే....పోనీ వెంటబడి తరిమే పిల్లలకు ఎట్లా నచ్చచెప్పడం....ఇప్పటికే మించి పోయింది....

గడంచలో నుండి లేచి నిశబ్దంగా అక్కడికిక్కడికి తిరుగసాగిండు....తనిప్పుడు ఏం చేయాలో ఎంతాలోచించినా తట్టలేదు—తన ప్రమేయం ఉన్నా లేకున్నా ఊళ్ళో పోరాటం జరిగి తీరుతుంది. ప్రజలకు కీడు జరిగితే ఇందులో రాజిరెడ్డి చెయ్యి ఉందని ప్రజలనుకుంటరు. దొరల ఆస్తులకు నష్టం జరిగితే దొరలు రాజిరెడ్డే ఊప్లానిచ్చిండంటరు. ప్రజలకు దూరమైతే దొరల పక్షం చేరాలి....దొరల పక్షం చేరడమంటె వంగి వంగి తిరుగాలి. లేదా ప్రజల పక్షమన్నా ఉండాలి! కాని మధ్యలో ఊగులాడుతూ ఉండలేం.

అర్ధరాత్రి దాటిపోయింది. గొల్లోల్లవాడకు కాపోలు కుక్కలు అదే పనిగా మొరుగుతున్నాయి. ఎక్కడో గుడ్లగూబ కూస్తోంది. నెల సూకింది....ఊరంతా నిశ్శబ్దం....ఆకాశంలో విమానం పోతున్నప్పుడు....అడుగులో అడుగేస్తూ ఇంటి ముందటికి వచ్చాడు. మూసి ఉన్న తలుపుల మీద చెయ్యేసి చాలాసేపు నిలుచున్నాడు.... సుగుణను పిలువాలా, అమ్మను పిలువాలా తేల్చుకోలేక తలుపుల పక్క సిమెంటు గద్దెమీద కూర్చున్నాడు. అట్లా ఆలోచిస్తూనే గద్దెమీద ముడుచుకపన్నాడు. ఒళ్ళంతా నొప్పులు....నలుగురు తన్ని ముగ్గురీడ్సినట్టుగా ఉన్నది. దానికి తోడు ఆకలి.... ఇలాంటి రాత్రిళ్లు కాలుకు బలుపంకట్టకుంటా ఒర్రెలు ఒంకలనక, చెట్లుపుట్టలనక, చలి వానలనక తిరిగేవాడు....ఇప్పుడో సీర్పం....ఏది చేతకావటంలేదు....విప్లవకారుడి జీవితంలో తన కోసం అరనిమిషం ఆలోచించుకోవడానికి తీరదు....ఇప్పుడో

853

ఎన్నిరోజులు తన గురించే ఆలోచించినా తెమలడంలేదు....భూస్వాములు, వాళ్ళ గుండాలు, పోలీసులు, వాళ్ళ ఆయుధాలు. దేన్ని ఖాతరు చెయ్యని ధైర్యం. ఇప్పుడు తననీడ తననే భయపెడుతోంది. పిల్లలను చూస్తేనే వణుకు పుడుతోంది....

ఈ దేకారు ఆలోచనలు కట్టిపెట్టి—సారా మామూలాలో తన కొచ్చింది తీసుకొని రాంరాం చెప్పి—మళ్ళీ పార్టీని కలిసి పనిచేస్తానని చెప్పడం ఉత్తమం. జానేదో సారాగీరా! మర్ నేదో పోలీస్ గీలీస్....కేసులు గీసులు గంగల పోనియ్యి.... చూద్దాం తర్వాతి సంగతి తర్వాత....పై నుంచి పార్టీ చెప్పితే ఊళ్ళే సంగం కిక్కురుమనది....

మళ్ళీ పనిచేయాలనే నిర్ణయానికి రావడం తోటే రాజిరెడ్డి మనసు తేలిక పడ్డది....నెత్తిమీది నుండి పెద్ద బండ కింద దించినట్లనిపించింది. పైరగాలి లేచింది....

ముడుచుకున్న కాళ్ళు బారజాపి రాజిరెడ్డి సిమెంటు గద్దెమీదనే కళ్ళు మూసుకున్నాడు. మరి కాసేపటికి గుర్రుకొట్టసాగిండు.

వంటింటి గడపమీద కునికిపాట్లు పడుతూ కొడుకు రాకకోసం ఎదురు చూస్తున్న రాజిరెడ్డి తల్లికిగాని, కొడుకు పక్కలో పండుకొని చప్పుడు కాకుండా కన్నీళ్లు కారుస్తున్న సుగుణకుగాని రాజిరెడ్డి ఇంటి ముందు నిద్రపోతున్నట్లు తెలియదు.

o o o

"ఎజెండాలో చివరి అంశం మిగిలిపోయింది." అన్నాడు కార్యదర్శి ఒకమారు నుదురు రుద్దుకొని....

అతని చుట్టు కూర్చొన్న నలుగురిలో ఇద్దరు ఆవులించారు. ఇద్దరు సిగరెట్లు ముట్టించారు....మిగతా ఇద్దరు నిద్రను పారదోలడానికి కళ్ళు రుద్దుకున్నారు....

"టీ ఉంటే బావుండేది...." అన్నాడు బక్క పలుచటి వ్యక్తి....

"బావుండేది కాని ఎట్లా సాధ్యం....? ఈ అంశం కూడా సాధ్యమైనంత త్వరగా ముగిస్తే తెల్లారేలోగా మనం ఎటువాళ్ళం అటు పోవచ్చు....ఒక్కొక్కరు మీమీ ఏరియాలకు సంబంధిన యూనిట్ల వివరాలు చెప్పండి...." కార్యదర్శి....

"సంఘాలల్లో దిగజారిపోవడం—మరి కొంతకాలం తర్వాత ఒడ్డున పడ్డ చేపలాగా అయిపోయి మళ్ళీ పనిచేస్తాననడం మామూలై పోయింది....ముఖ్యంగా మధ్య తరగతి వాళ్ళ నుండి ఎక్కువగా—కింది తరగతి వాళ్ళల్లో కూడా చాలా కాలం నుండి కొద్దిగా ఇలాంటి సమస్యలు వస్తున్నాయి...."

854

"కామ్రేడ్స్! మనది ప్రజల పార్టీ....కాలం గడిచేకొద్దీ— మనం రాజకీయంగా సంఘాలను తర్ఫీదు చేయకపోతే— వివిధ సెక్షన్ల ప్రజలను సమన్వయ పరుచలేక పోతే బలమైన పార్టీని నిర్మించలేం....ఒక్క మన ఏరియాలోనే కాదు—రాష్ట్రమంతటా ఇలాంటి సమస్యలు ఎదురౌతున్నట్లు రిపోర్ట్సు తెలుపుతున్నాయి. ఇలాంటి సమస్యలను ప్రజాపంథాలో పరిష్కరించుకోవడం ఎలా? అనేది తెలియ చెప్పడానికే గత నెలలో మన పత్రికలో వచ్చిన వ్యాసం చదివే ఉంటారు. ఆ వ్యాసంలో సంఘాలల్లో నాయకత్వ సమస్యల గురించి వివరంగా చర్చించడం జరిగింది.... ప్రజల నుండి నేర్చుకొని ప్రజలకు మనం నాయకత్వం అందించడం గురించి ప్రస్తావించడం జరిగింది....అదే వ్యాసంలో కామ్రేడ్ మావో "నాయకత్వ పద్ధతులపై కేంద్ర కమిటీ తీర్మానం"లోని ఒక మాట చెప్పడం జరిగింది....

"ప్రజలలో ఉండే అభిప్రాయాలు ఒకదానితో ఒకటి సంబంధం లేకుండా చెల్లాచెదురుగా ఉంటాయి. వాటిని మనం మొదట అర్థం చేసుకోవాలి....సమన్వయ పరుచాలి. అప్పుడు నిర్ధారణగా తేలిన విషయాలను తిరిగి ప్రజల్లోకి తీసుకవెళ్ళి అవి తమవే అని భావించేవరకు అలుపు లేకుండా ప్రచారం చేయాలి....కార్యాచరణలో వాటి మంచి చెడ్డలను తేల్చాలి. తిరిగి తిరిగి ఈ పని చేయడం ద్వారా మనం విప్లవంలో ప్రజలకు నాయకత్వం వహించగలం....ఉదాహరణగా చెప్పాలంటే ఒక వ్యక్తి మంచి చెడ్డల గురించి పోరాటంలో అతని పాత్ర గురించి నిర్ణయించాలంటే ఒకరిద్దరి అభిప్రాయాలు సరిపోవు. ఒక్కొక్కప్పుడు మనం స్వీయ మానసిక ధోరణులకు లోనుకావచ్చు....కామ్రేడ్స్ మరింక మీ మీ రిపోర్టు చెప్పండి." కార్యదర్శి....

"మా ఏరియాకు సంబంధించి అలాంటి వివరమైన రిపోర్టు తయారు చేయలేదు....వచ్చే మీటింగు వరకు తయారు చేస్తాం" కోలముఖం వ్యక్తి....

"ఇంతవరకు మాకలాంటి సమస్యరాలేదు." కురుచమనిషి

ఆఖరున చెప్పాలా వద్దా అని కాసేపాలోచించి "మా ఏరియానుండి రాజిరెడ్డి మళ్ళీ పని చేయదలుచుకున్నట్లు వర్తమానం పంపాడు." అన్నాడు సన్నగా రివటలాగా ఉన్నతను.

కార్యదర్శితో పాటు మిగతా ముగ్గురు ఏం మాట్లాడలేదు. ఒకరు మాట్లాడగలరని ఇంకొకరు ఎదురు చూశారు.... "ఆశ్చర్యంగా ఉందే?" కోలముఖపు అతను గొనిగినట్లుగా అన్నాడు.

"రాజిరెడ్డి విషయం చర్చిద్దాం....పూర్తి వివరాలు చెప్పండి కామ్రేడ్.... మిగతా కామ్రేడ్సుకు కొంత కొంత తెలుసున్నా – మీ రిపోర్టు ముఖ్యం." కార్యదర్శి....

"ముందు చేర్చుకోవాలా వద్దా అనేది తేల్చడం మంచిది." కురుచ వ్యక్తి....

"ముందు ఆయన గురించిన సంగతులు ఆ ఏరియా బాధ్యున్ని చెప్పమన్నాడు కదా కార్యదర్శి" ఒకరు....

"నాకో చిన్న సందేహం. నా వ్యక్తిగత అభిప్రాయం చెప్పమంటారా? యూనిట్ అభిప్రాయం గాని, రైతుకూలి సంఘం అభిప్రాయం గాని నేను తీసుకోలేదు." బక్కటాయన.

"ఇప్పటికే చాలా సమయం గడిచిపోయింది మనం తెల్లారేటాల్లకు పోవాలె.... ఏదో ఒకటి తొందరగా కానిస్తే" పొట్టాయన....

"అనొంటప్పుడు ఆయిద బెడితె మంచిది గదా!" బోడగుండాయన....

"వాయిదా వేయడానికేమున్నదిగని. మన కోసం సమస్యలు ఆగవు కదా!" కోలముఖపు వ్యక్తి.

"స్పష్టంగా నీ అభిప్రాయం చెప్పు కామ్రేడ్." కార్యదర్శి.

బక్కటాయినె మళ్ళో సిగరెట్టు ముట్టిచ్చి- కాసంత ముందుకు జరిగి- "నిజానికి చెప్పవలసిన సంగతులు బాగనే ఉన్నయి- 1978 లో ఆ ఊళ్ళో ప్రజా సంఘం ఏర్పడి దొరలకు వ్యతిరేకంగా నిలబడ్డది. మా ఏరియాలోనైతే సంఘాలలో చురుకుగా కదిలింది పెద్ద కులాల మధ్యతరగతి యువకులే- అంతో యింతో చదువుకొని పాటలు పాడి జనాన్ని ఆకర్షించగలిగారు. అప్పట్ల వాళ్ళ వర్గపునాది గురించి ఇంత బాగా ఆలోచన లుండేవికావు.... రాజిరెడ్డి రైతుకూలీ సంఘం ఏర్పాటు చేయటం దగ్గరి నుండి- దొరలమీద సాంఘిక బహిష్కారం విధించి ఊళ్లెనుంచి వెళ్ళగొట్టేదాకా చురుకుగా పనిచేశాడు. ఈ క్రమంలో వచ్చిన నిర్బంధంలో కూడా రాజిరెడ్డి ప్రజల పక్షంలోనే ఉన్నాడు. ఆ ఊళ్ళోనుండి ఒకరిద్దరు పూర్తి కాలపు కార్యకర్తలు ఎదిగి పక్క ఊళ్ళల్లో పనిచేయడానికి పంపగలిగారు— రాజిరెడ్డి మధ్యతరగతి రైతుల్లో ఎగువ సెక్షను నుండి వచ్చాడు.... సంఘ కార్యక్రమాల్లో పాల్గొక ముందు తను పనిచేస్తూ- మిగతా కొందరిని కూలికి పనిచేయించుకునేవాడు.... ఆ చుట్టుప్రక్కల గ్రామాలల్లో రాజిరెడ్డికి తెలిసిన ఇద్దరు కామ్రేడ్సు ఒకరు పోలీసు కాల్పుల్లో, మరొకరు బాంబు పేలి మరణించారు.... మొత్తానికి అప్పటినుండి రాజి

856

రెడ్డిలో ఊగిసలాట మొదలయ్యింది.... వరంగల్ పోయిన దొరలు ఊళ్లకు పోలీసులను దోలించారు.... అరెస్టులు, సోదాలు, కేసులు ఎక్కువయ్యాయి.... మరింక రాజిరెడ్డి బహిరంగ కార్యక్రమాలు చేసే పరిస్థితి పోయింది. రహస్యంగా పనిచేయవలసిందిగా నేనతనికి సలహా యిచ్చాను. ఫర్వాలేదు, అలాంటి వేళ వచ్చినప్పుడు చూద్దామని ఎప్పటికప్పుడు దాటవేశాడు.... అప్పటికే రాజిరెడ్డి పాతమిత్రులు కొందరు ఉద్యమం నుండి తప్పుకొని వ్యాపారంలో సెటిలయ్యారు.... 81 సెప్టెంబరు నెలలో పాత మిత్రులైన ధనిక రైతుల కొడుకులతో తిర్గడం సాగించాడు. స్థానిక రైతుకూలీ సంఘం ఒకటి రెండు సార్లు చెప్పిచూసింది.... "పార్టీ వాళ్లే కలుపుమన్నారు. చందాల కోసం కలుస్తున్న లేపోతే వాళ్ళతోని నాకేంపని" అని వాళ్ళకు చెప్పాడు.... నేనడుగుతే "నేనట్లా చెప్పలేదు.... పాత దోస్తానీల ఒకమారు కలిసిన్నంతే" అన్నాడు. "ఏదేమైన ప్రజలు మనలను వెయ్యి కళ్ళతో కనిపెడుతుంటారు.... సాధ్యమైనంత వరకు అలాంటి వాళ్ళను కలువద్దు.... పైగా నువ్వు చందాల పేరు చెప్పుతే రైతులు అదేపని మొదలు పెడితే ఎట్లా?" అని మందలించాను. ఆ తరువాత సారా మాఫులాలో భాగం తీసుకున్నట్లుగా తెలిసి నేను ప్రత్యేకంగా కలవాలని వెళ్ళాను. ఇంట్లో ఉండి లేడని చెప్పి పంపాడు. తర్వాత సాయంత్రం కలిసి "రాజకీయాల విషయంలో భేదాభిప్రాయం లేదని- వ్యక్తిగత కారణాల మూలకంగా కొంత కాలం పనిచేయలేన"ని చెప్పాడు. "ఇంత దూరం వచ్చిన తరువాత అటు ప్రజలకో లేక శత్రువుకో ఉపయోగపడకుండా మధ్యస్తంగా ఉండడం సాధ్యం కాదని.... బాగా ఆలోచించవలసిందిగా" నేను చెప్పిన. అప్పటినుండి రైతుకూలీ సంఘం అతనితో తెగతెంపులు చేసుకున్నది. అతని మానాన అతన్ని వొదిలి తమ కార్యక్రమాలేవో తామే చూసుకోవడం సాగించింది. కాని బాల సంఘం మాత్రం రాజిరెడ్డిని వొదిలిపెట్టలేదు. వెంటబడి అల్లరి చేశారు. పాటలుకట్టి పాడారు. మొదట ఏదో పిల్లలనుకున్నాడు. కాని రానురాను పిల్లలే పిడుగులయ్యారు. ఇంకొక పక్క ఏ భద్రత దొరుకగలదనుకొని ఉద్యమం నుండి తప్పుకున్నాడో అది అందే సూచన కన్పించలేదు. ఊళ్ళోవాళ్ళు సూటిపోటి మాటలంటున్నారు.... అటు దొరలు దగ్గరికి తీయలేదు ... పోలీసోల్లు ఏది జరిగినా రాజిరెడ్డినే పట్టుకపోతున్నారు.... ఊరిడిచి కొన్నాళ్లు బయట తిరిగాడు. ఊళ్లకొస్తె పిల్లలు వెంటబడుతున్నారు.... మొత్తానికి రాజిరెడ్డి పరిస్థితి ఒడ్డున పడ్డ చేప తీరుగైపోయింది. మళ్ళీ ఆలోచించుకొని మనకు కబురు పంపాడు." బక్కటాయన ముగించాడు.

857

"ప్రజలపట్ల అతని ఆలోచన లెట్లున్నాయి" కురుచటాయన.

"రాజకీయాలు అంతంత మాత్రమే- ఇప్పటికీ ప్రజల శక్తిని గుర్తించడం లేదు." బక్కటాయన.

"అయితే కష్టమే." కోలముఖపాయన.

"కామ్రేడ్సు రాణిరెడ్డి గురించి ఆ ఏరియా కామ్రేడు తన అభిప్రాయం చెప్పాడు.... మీమీ అభిప్రాయాలు చెప్పండి." కార్యదర్శి.

"అతని ఆలోచనల్లో నిజంగానే మార్పురానంత వరకు మల్ల తీసుకుంటే- ఇంక తీవ్ర నిర్బంధం పెరిగితే మళ్ళీ పోతడు." కోలముఖపాయన.

"ఆలోచనలో మార్పంటే కొలబద్దేమిటి ?" కురచటాయన-

"మీమీ అభిప్రాయాలు చెప్పండి- ఎదురు ప్రశ్నించడం కాదు." కార్యదర్శి.

"అర్థం కాకుంటే అడుగద్దా ?"

"సరే. కామ్రేడ్! మీరు ఆ ప్రశ్నకు జవాబు చెప్పండి- కామ్రేడ్స్! చర్చలోకి దిగితే కాలయాపన జరుగుద్దనే నేను అట్ల అన్నాను." కార్యదర్శి.

"కొలబద్దంటే ఆచరణ ద్వారా రుజువు కావడం- అది ప్రజలతో కలిసి పని చేయడం ద్వారానే తెలుస్తుంది."

"అట్లయితే మనకు ఎవరు మిగులుతరు ?"

"మిగులరని అందరిని చేర్చుకుంటూ పోతే కొన్నాళ్ళకు వాళ్ల లోపటచేరి తొలవటం మొదలుపెడ్తరు.... ఆఖరుకు మనది రివిజనిస్టు పార్టీగా తయారవుతుంది."

"జనాన్ని తర్ఫీదు చేయాలి...." కోలముఖపాయన అడ్డుతగులుతూ....

కార్యదర్శి కల్పించుకొని "మీమీ అభిప్రాయాలు చెప్పండి."

"నా అభిప్రాయమైతే తనకై తాను మల్ల ప్రజల్ల కలిసి పనిచేస్తనంటే తీసుకోవడంలో తప్పులేదు." పొట్టాయన.

"మీరు కామ్రేడ్?" కోలముఖపాయన నుద్దేశించి.

"అతనికి రాజకీయ పరిజ్ఞానం కలిగించేటట్లయితే చేర్చుకోవచ్చు." కోల ముఖపాయన చెప్పకముందే బక్కటాయన చెప్పాడు....

"మీరు కామ్రేడ్?" కొద్దిగా ముఖం మాడ్చుకున్న కోలముఖపాయనుద్దేశించి....

858

"నాకు రెండు బాగానే ఉన్నాయి" అన్నాడు అగ్గిపెట్టె గీకుతూ-

"అట్లంటెట్ల కామ్రేడ్...."

"నాకు అనుభవంలేదు...."

"సరే మీరు చెప్పండి" ఆఖరుగా కూర్చున్న ముతక బట్టల బోడగుండు రైతు నడిగాడు కార్యదర్శి.

"ఏదో వోటి కానియ్యుండ్లి – మీ కందరికి ఎట్ల దోస్తె గట్ల కానియ్యండి" అన్నాడు గీతలు గీస్తూ రైతు....

"అట్లంటెట్ల కామ్రేడ్ ? మనది ప్రజల పార్టీ. అనుభవంరీత్యా వయసు రీత్యా మీరు మాకన్న పెద్దవారు ... మీ అభిప్రాయం నిర్మొహమాటంగా చెప్పండి. ఎవల కడుపుల వాళ్ళం ఉంచుకుంటే మనందరం ఎదిగే దెట్లా ?" కార్యదర్శి ...

రైతు అందరి ముఖాలల్లోకి చూశాడు....

"రాజిరెడ్డి సంగతి మనమంత మాట్లాడ్తన్న తీరు సూత్తె మావూల్లె ఎనకట జరిగేటి పంచాతులు మతికచ్చినయ్- సంకరోన్ని దోలి దొరలు పసుల మీదోల్లందరిని పేరుకు కుప్పేసెటోల్లు ... తీరిపారంగ కూకుండి పిట్టకతలు సెప్పుకచ్చి ఆఖర్న నలుగురున్నకాడ నారాయుడున్నట్టే అని చెప్పి- వాళ్ల తొత్తులతోని చెప్పేటిది చెప్పిచ్చి-ఇగ మంది ఒకల మొఖాలొకలు సూసుకునేటోల్లు–ఇడుపుమంటె పాంకు కోపం–పట్టుమంటె కప్పకుకోపం– దొరలు దొరలు నింద నిట్టూరాలు పల్లికు మీద ఏసెటోల్లు-కోప్పడకుండ్లి కామ్రేడ్లు–మన మంత అలగలగ్ కాదనుకోండ్లి .... రాజిరెడ్డి సంగలనెత్తే సెరుపుల దున్నపోతును దోలి కొమ్ములకు బేరం పెట్టినట్టున్నది" అన్నడు సరాంచి.

అక్కడ కూర్చున్న వాళ్లంతా ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఎవరికి వారే అంతరార్థం గురించి ఆలోచించారు. ఫలానా సంగతని ఎవరికి ఇతమిద్ధంగా తేలలేదు.

"కొద్దిగా అర్థమయ్యేటట్లుచెప్పు కామ్రేడ్" కార్యదర్శి నెత్తి గోక్కుంటూ—

"ఇందల్లు అయి మూల లేసున్నయిసారు. బానమేసినట్టు సాపు సీదగనే ఉన్నది. రాజిరెడ్డి సెత్తంత సెపురులున్నది. కొమ్ములు మాత్రం మీదికి గన్పడ్త న్నయి.... సెత్త సంగతి సెరుపుకెరుక....రాజిరెడ్డి మంచి సెడ్డలు ఆ పూరి సంగాని

859

నేటుక- రేపు అయిన తోటి కలిసి వస్తెనెటోళ్ళు అన్న— అందుకని రాజిరెడ్డిని కడుపుల పెట్టుకుంటరో కాదు పొమ్మంటరో ఆ ఊళ్లోల్ల నేటుక. మా అంటె మనం మద్దెవర్తుల గుండగలం.... నన్నడుగుతె రాజిరెడ్డిగీ ముచ్చట సంగానికెందుకు జెప్పుకోలె ? నీ మాట చెప్పు, నీ మాట చెప్పుమని అడిగినంగని-ఆ కామ్రేడు సంఘాన్ని అడిగింకా ఆళ్ళ మంటండ్లో తెలుసుకోవాలెనలే- సీదా మన దగ్గర కెందు కచ్చిండు. సారు నాకు దోసిందేమిటంటె రాజిరెడ్డి సంగపోల్లను గుడ్డపేగులోల్ల కిందనే సూత్తండు— గుడ్డ పేగులోల్లకు రాజకీయాలు ఏం దెలుసు ? పైనోల్లు చెప్పితే కిందోల్లు కిక్కుటు మనరని ధీమా— దీన్నేమంటరో నాకు తెలువది గని రాజిరెడ్డి మనుసుల గమాటున్నదని నాకు తోత్తంది.”

“నేను మొదట్లనే చెప్పిన గదా! నా అభిప్రాయం మాత్రమే చెప్పుతున్న.... నేను సంఘం అభిప్రాయం తెలుసుకోలేదని” బక్కటాయన....

“కోప్పడకుండ్లి సారు... సంగం సంగతి తెలుసుకొన్నంకనే మనం ఏదన్న చేత్తె బాగుంటదని- ఇందాక మన కార్యదర్శి చెప్పిండు గద... ప్రజల్లో ఉన్న మాటలన్ని ఇనాలె—ఒకడు రాజిరెడ్డి లంగంటడు—మరొకడు జెరంత లిక్కరోగ మున్నదిగని మంచోదే నంటడు—మరొకవ్వ— పెషామంటె పెషామిగనొంటోడు అక్కెరకు రాదంటది. వాళ్ల కంటండ్లో గ మాటల సారాయమంత దీసి— గి సొంటి టయిముల ఎనుకట పెద్ద పెద్ద నాయకులు ఏం జేసిండ్లో ? ఏం చెప్పిండ్లో యాదికి దెచ్చుకొని మనం నడువాలె— గప్పుడు పబ్లీకు వారేవా అవ్వల్లిట్ల చేసిండ్లంటరు” రైతు ఉత్సాహంగా చెప్పుకొచ్చాడు.

“నాకైతే మన కామ్రేడు చెప్పింది సబబుగా తోస్తోంది ... ఈ సమయంలో మన పత్రికలో రాసిన మావో మాట మనం గుర్తుంచుకోవాలి. పార్టీలో స్వీయ మానసిక వాదుల పెత్తందారీ ధోరణులను ఖండిస్తూ మావో ఇట్లా చెప్పిండు— “ఏ పనిలోనైనా పెత్తందారీ విధానం తప్పు. ప్రజల చైతన్య స్థాయిని కాదని ముందుకు పోవడానికి ప్రయత్నించడం, బుద్ధిపూర్వకంగా ప్రజలు కార్యరంగంలోకి దిగాలనే విషయాన్ని దాటవేయడం, దుస్సాహసిక విధానమనే రోగాన్ని కలిగి ఉన్నట్టే లెక్క. మన కామ్రేడ్సు అర్థం చేసుకున్న విషయాన్ని ప్రజలు అర్థంచేసుకున్నట్లుగా లెక్క కట్టడం పొరపాటు. ఏదైన విషయాన్ని ప్రజలు అర్థం చేసుకున్నారా, కార్యాచరణకు సిద్ధంగా ఉన్నారా-అనే విషయాన్ని తెలుసుకోవడానికి

మనం ప్రజల్లోకి తప్పకుండా వెళ్ళి తెలుసుకోవాలి. పరిస్థితులకు వెనుకబడి ఉండడం కూడాతప్పే. ప్రజల రాజకీయ చైతన్య స్థాయికన్నా వెనుకబడి ఉండడం మూలకంగా ప్రజలకు నాయకత్వాన్ని అందియ్యలేం- ఇది కాలయాపన చేసేరోగమవుతుంది. మన కింకా తెలియని విషయం ప్రజలకు కూడా తెలియరాదని భావించరాదు. అనేక సందర్భాలల్లో ప్రజలు మనకన్నా ఒకడుగు ముందే ఉంటారు.... కనుక వెంటనే చొరవ తీసుకొని రాజిరెడ్డి విషయంలో సరైన నిర్ణయం తీసుకోవాల్సిందిగా ఆ ఏరియా బాధ్యుడైన కామ్రేడ్‌ను కోరుతున్నాను." కార్యదర్శి ముగించాడు.

"నేను ఆ ఊళ్ళో బహిరంగంగా తిరిగే వీలులేదు కామ్రేడ్" బక్క పలుచ టాయన....

"పోనీ రైతు కూలీ సంఘం బాధ్యులను కలువండి.... వాళ్ళ అభిప్రాయం తెలుసుకొని, వాళ్లతో చర్చించి ఏ విషయం నిర్ణయించండి" పెద్దాయన....

"కష్టం. రాజిరెడ్డి అనేక సమస్యలను లేవనెత్తవచ్చు. పార్టీ వాళ్ల లేకుండా సమస్య పరిష్కరింపబడగలదని నేననుకోను...."

"పోనీ నీలయ్యగారిని వెంట తీసుకవెళ్ళండి...." కార్యదర్శి.

"పోవటానికేంది గని— నాకు మాటెనుక మాట మాట్లాడరాదు" నీలయ్య అనబడే రైతు ...

"ప్రజలనుండి నేర్చుకుందాం...."

నీలయ్య మాట్లాడలేదు. అంగీకరించినట్లుగానే అంతా భావించారు.

"సమావేశం ముగిసింది" కార్యదర్శి....

"ఇంకొక సంగతి సారు! రాజిరెడ్డి నేను పార్టీకి చెప్పిన— సంగం ముందుకు నేను రానంటేనో!" నీలయ్య అనుమానం వ్యక్తం చేశాడు.

"మన కామ్రేడ్ ముందుగా రాజిరెడ్డిని కలిసి కమిటి నిర్ణయాన్ని రాజిరెడ్డికి తెలియజేస్తాడు... రావటం మానుకోవడం రాజిరెడ్డి యిష్టం ... ప్రజలతో నిజంగానే కలిసి పని చేయాలనుకున్న వాడైతే వస్తాడు. లేకపోతే ఆయన దారి ఆయన చూసుకుంటాడు.... ప్రజలను కుప్పజేసి అదే విషయం ప్రకటిస్తే సరిపోతుంది" కార్యదర్శి ...

సమావేశం ముగిసింది....

× × ×

ఉప్పరి రాములయ్య మోట బావికాడ పడివుంది చూస్తున్నారు....మధ్యలో శేఖర్ (ఒక్కటాయనకా ఉన్నో పేరు) కూర్చున్నాడు....

"రాజిరెడ్డి గత ఏడాదినుండి మన సంఘ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు.... మనది ప్రజలపార్టీ ఓ ఒక్కరిచేతనో పోరాటం నడువదని - మీ రైతుకూలీ సంఘం నిరూపించింది.... ఈ ఏడాదిలో మన సంఘం ఎన్నో పోరాటాలు చేసింది.... మనతో కలిసి పని చేశాడనో - యితర మొగమాటల మూలకంగానో రాజిరెడ్డి విషయంలో సంఘం శత్రువైఖరి అవలంబించలేదు.... కాని బాల సంఘం గత మూడు నెలలనుండి అతన్ని అటలు పట్టిస్తోంది....ఇంకోపక్క ఏ బతుకు అలించి బయటికి పోయాడో అవి దొరకలేదు. మొత్తానికి రాజిరెడ్డి మళ్ళీ పని చేస్తానని నాకు వర్తమానం పంపిండు. నేనొక్కన్నే నిర్ణయం చేసుకోవడం బాగుండదని - రాజిరెడ్డి పనిచేయవలసింది మన సంఘంతో కనుక - రాజిరెడ్డి మంచి చెడ్డలు సంఘమే నిర్ణయించాలని నేనుకొని మిమ్మల్ని కలువడం జరిగింది... ఏం చేద్దామంటారు?" శేఖర్ ....

నీలయ్య లేత వెన్నెల వెలుగుల అందరి ముఖాలు పరిశీలిస్తున్నాడు....

వెనుక కూర్చున్న బానయ్య దుబ్బలో గుర్రుకొడుతున్నాడు. అతనిపక్క కూర్చున్న మొగిలి బానయ్య చెంపమీద కోపంగా కొట్టి కూకుండబెట్టి - "వారీ ఎడ్డి బానాలు - మనకోసం సాట్ల గంత దూరంనుంచి వస్తే నువ్వు మారాజు నిదుర బోతన్నవా?" అన్నాడు....

"దుత్తెరి లొట్టల సాట్ల...." బానయ్య కసురుకున్నాడు.

శేఖర్‌కు చిప్పక్కుమనిపించింది. కొద్దిగా కోపంకూడా కలిగింది. "మనం ఏ దొరలను వద్దనుకున్నమో వాళ్ళ పద్ధతులనూ వద్దనుకోవాలె. ఆ కామ్రేడు పొద్దంతా పనిచేసి ఉన్నాడు. కమ్యూనిస్టులం కొట్టుకోవద్దు - ఓపిగ్గా నచ్చచెప్పుకోవాలి - కామ్రేడ్! మనం రాజిరెడ్డి విషయంలో మాట్లాడుకోవాలనుకున్నాం" అంటూ ఇంతకుముందు తను మాట్లాడిన విషయాన్ని మళ్ళీ చెప్పుకొచ్చాడు.

"బానయ్యది కుంభకర్ణుని నిద్ర - సందు దొరికితే సాలు గుర్రుకొడుతడు," బాపు అనే రైతు....

"ఆడికి మీకు అన్నలు నిదురేలేనట్లు...." బానయ్య కండ్లు నులుపుకొని....

"కామ్రేడ్సు మీ మీ అభిప్రాయాలు చెప్పండి." శేఖర్....

"మాదేముంది సారు. తమరెట్లంటె అట్ల...." నర్సయ్య....

"ఎద్దు మడి దొడుసుక బతికినం - గీ అయి మూలలు ముసుర్ప సూసినవా ఏమన్నా ?" అయిలయ్య

"ఏం జూడలేదే—గిప్పుడు పరంపోగుల పంపకమను - సెంగలిప్పుకుంట ఉరికత్తరు—ఊళ్ళె తిరుక్కుంట ఆడాడ అనచ్చు - మనసారత్తె ఏం ఎరుగనోల్ల తీర్గ మాదేపుంది సారని తప్పించుకుంటండ్లు—" యువకుడైన రాజీరు....

"అంతే బాప్మర్తి! ఎనుకోమాట ముంగతోమాట ఉండద్దు - కట్టె కొట్టె జెప్పన చెప్పరాదుండ్లి—" బానయ్య ఆపులిస్తూనే——

"బోయినోన్ని బోనియ్యక మల్ల పిలుసుడేంది? పిలిసి పిల్లని త్తనంటే కులం తక్కువన్నట్టయితది" మొగిలి.

"అగో పడుసో పెడుసోంటి సంగపెద్దలు చెప్పుతండ్లు గద సాదు— కాని య్యండ్లి—" అయిలయ్య—

ఇట్లాగ తెగనియ్యకుంట బలువనియ్యకుంట తలోమాట మాట్లాడారు—

శేఖర్‌కు విసుగొచ్చింది— ఏ సంగతైనా ఉత్సాహంగా మాట్లాడేవాళ్ళు ఇవ్వాళ అనాసక్తంగా మాట్లాడుతున్నారు—రాజిరెడ్డి తమనికాదని పార్టీకి చెప్పుకోవడం కొందరికి కోపంగా ఉన్నట్లు గ్రహించాడు—

"కామ్రేడ్సు మీ మాటల బట్టి నాకర్థమయ్యిందేమంటే" శేఖర్ ఆగి అందరి ముఖాలల్లోకి చూశాడు—

అప్పుడు నీలయ్య ఏదో మాట్లాడబోయాడు—

"కామ్రేడ్సు ముందుగా మన నీలయ్య కామ్రేడ్‌ను పరిచయం చేయనందుకు మన్నించాలి—మన తాలూకాలోని రైతు కూలీసంఘం మనిషి - మన సంగం పని తీరు చూస్తానని వచ్చాడు—మీరు అనుమతిస్తే నీలయ్యగారు మాట్లాడుతారు—"

"మాట్లాడు కామ్రేడ్—ఏమూరైతేంది - సంగపోల్లమంత ఒక్కటే -" బానయ్య—

"అప్పటినుంచి మన సంగపోల్లు మాట్లాడిందానిబట్టి నాకు తెల్సిందేందంటే - రాజిరెడ్డి సంగాన్నిగాదని పెద్దోల్లకు చెప్పుకున్నడని—మన పెద్దోల్లు గరీబోల్ల పచ్చానేన్ని పని చేస్తండ్లు కనుకనే అళ్ళు మల్ల మన దగ్గరికి తీసుకచ్చిండ్లు - రాజిరెడ్డసోంటోల్లు మనల లచ్చపెట్టకుంటె తప్పని చెప్పు తండ్లు. గిదిమన సంగతి. మీరంత ముందుకచ్చి తేల్చాలె. అత్తమీది కోపం దుత్తమీద లేసినట్టు మనండ్ల

మనం కడుపుల పెట్టుకున్నా! మరుగున పెట్టిన్నా మనకే చెడుపు—మన సొదుకు ఖుల్లం ఖుల్ల చెప్పుకోవాలె—" ఇట్ల చెప్పుకొచ్చాడు.

"అయితే రాజిరెడ్డిని తప్పన్నరుగద - గుడ్డపేగులోల్లు వీల్లతో నేందయిత దనుకుంటడు - అయినె ఉండంగ తనమాట తనదెగాని మామాట జొరనిచ్చింనా?" నర్సయ్య.

"మరి గట్ల చేత్తండని ఎప్పుడన్న బయటపెట్టింల్లా?" నీలయ్య. "ఏడ—ఏముంటె ఏమ త్తదోనని" అయిలయ్య.

"గందుకనే తొండమురిరి ఊసరెల్లయ్యింది." రాజీరు.

అప్పుడు దాదాపు అందరు "రాజిరెడ్డిని సంగంలకు తీసుకోవద్దు -" అని చెప్పుకొచ్చారు. కొందరు ఏమేమి చేసిండో చెప్పుకొచ్చింల్లు—

నీలయ్య, శేఖర్ ఓపిగ్గా విన్నారు—రాజిరెడ్డి గురించి చాలా విషయాలు తెలిశాయి—

ఆఖరున వెంటయ్య కల్పించుకొని - "మీరంతా చెప్పింది వాగానే ఉన్నది—రాజిరెడ్డిని మల్ల గింతమంది దగ్గరికే పిలిసి అడుగవచ్చు. అయినె చెప్పేటియి అయినె చెప్పుతడు - మనం చెప్పేటియి మనం చెప్పుతం. మనం నీకు మాకు పొత్తు కుదరదని తెగేసి చెప్పుతం - అయినె ఊళ్ళె ఇగో నేను మల్ల పని చేత్తనంటె సంగపోల్లు పడనిత్తలేదని పచారం చేత్తడు. రైతు కూలి సంగమంటే మల్ల కొద్ది మందిమే ఉంటం - ఇది ఊరందరికి కావాల్సిన సంగతి మల్ల అల్లిట్ల నచ్చినోల్లను సంగంల కలుపుకుంటరు - ఇట్టంలేనోల్ల వద్దు పొమ్మంటరు - మమ్ముల అడిగింల్లా అని ప్రజలంటరు. అదిగాక మనతోటి కలిసి తిర్గిండుగన్క మొకంమీద అనలేం - గిసొంటి సంగతి పజలందరికి తెలుత్తెమంచిది—ఎవల పొట్టల ఏమున్నదో మన కెట్ల తెలుస్తది—" చెప్పుకొచ్చాడు -

"కాబ్రేడ్సు రేపు పగలు ఊళ్ళోలందరిని కుప్పచేసి అన్ని సంగతులు ప్రజల ముందు పెడుదాం - అందర్ని స్వేచ్ఛగా వాళ్ళ వాళ్ళ అభిప్రాయాలు చెప్పమందాం- అంతిమ నిర్ణయం ప్రజలకే ఒదిలిపెడుదాం—" శేఖర్—

"ఈ ముచ్చట బాగున్నది సారూ!" అయిలయ్య—

"అయింక మాదేమున్నది అని సేతు లెల్లలుకల ఎయ్యేదు గదా!" మొగిలి నవ్వుతూ—

864

"మా దండి మొగోడచ్చిండు మంచ మెల్లెలుకలేయి మన్నదట -" నర్సయ్య మొగిలికి అంటించాడు—

ఎటోలటు లేచిపోయారు—నీలయ్య, కొమురయ్య, శేఖర్, పెంటయ్య మిగిలిపోయారు—

"నువ్వు ఒక్క మాటన్న మాట్లాడకపోతివి -" పెంటయ్య కొమురయ్య నడిగాడు -

"వింటన్న—నాకు జెప్పన మాట్లాడరాదు -" నత్తి నత్తిగా—

"ఈ సంగతి రాజిరెడ్డికి చెప్పాల -" శేఖర్ అన్నాడు—

"మేం చెప్పితే ముందుగాలచ్చి మమ్ముల్నే కలిసిండనుకుంటడు—నువ్వే కలిత్తె మంచిగుంటది సారూ! అంత లావయితె అళ్ళింట్ల ఎవలున్నరో ముందుగాల సూసొత్తె అయిపాయె—" పెంటయ్య—

"గవనంబె నాకు సాతనైతది -" కొమురయ్య—

* * *

అర్ధరాత్రి దాటిపోయింది—శేఖర్ ఇంక రాకపోయెనని కొమురయ్య రెండు సార్లు ఓరగంట చూస్తూ రాజిరెడ్డి ఇంటి ముందునుండి నడిచిపోయాడు—

"మీకు తెలియనిదేమున్నది కామ్రేడ్—" ఏయేయే పరిస్థితుల్లో, ఎలాంటి ఒత్తిళ్ళ మూలకంగా తను చురుకుగా ఉండలేకపోయాడో - మళ్ళీ ఏ కారణంచేత పని చేయాలనుకుంటున్నాడో - వాల సంఘం ప్రసక్తిలేకుండా రాజిరెడ్డి చెప్పుకొచ్చాడు—

శేఖర్ ఏ విధమైన వ్యాఖ్యానం చేయకుండా అంతా ఓపిగ్గా విన్నాడు...

"కామ్రేడ్! పార్టీకి ఈ కారణాలన్ని తెలుసు....మనకు పార్టీకి ఉండే సన్నిహితత్వంతో సానుభూతిగానే అర్థం చేసుకోవచ్చు—కాని పార్టీ ప్రజలకోసం, ప్రజల మధ్య, ప్రజలతో కలిసి పనిచేయాలి....అంటే ప్రజలు మనస్ఫూర్తిగా పార్టీని తమ దానిగా కడుపులో దాచుకోవాలి....అంటే ఏ విషయాన్నైనా మనం ప్రజల ముందుంచి వాళ్ళు ఆమోదించిన తరువాతే కదా ఆచరించడం....ఒకటికి వందసార్లు మనం విషయాన్ని విడమర్చి వాళ్ళకు నచ్చచెప్పాలి. ఓపిగ్గా వాళ్ళకు అర్థం చేయించాలి ...కనుక మీ విషయాన్ని మీ ఊరి ప్రజలకు మీరే నివేదించుకోవడం మంచిదని పార్టీ అభిప్రాయ పడుతోంది....నాకు చెప్పిన విషయాలన్ని ప్రజల ముందు చెప్పండి ...." శేఖర్ ....

"వాళ్ళు...." రాజిరెడ్డి నసుగుతూ....

"కామ్రేడ్ ఆలోచించండి....పార్టీ మిమ్మల్ని పనిచేయమని చెప్పగలదను కోండి. మీరైనా ప్రజల్లోనేకదా పనిచేసేది? అప్పుడువాళ్ళ ఈసమస్యలన్ని లేవనెత్తరా? సమస్యను దాటవేయడం పరిష్కారంకాదు–అది మరింత పెద్దదై మన ముందుకు వస్తుంది–మన ముందుకు వచ్చిన సమస్యను సరైన సమయంలో పరిష్కరించడమే కమ్యూనిస్టులు చేయవలసింది—మీరు బాగా ఆలోచించండి...." శేఖర్....

"సరే కామ్రేడ్.... ముందుగ మీరు సంగంతో మాట్లాడండి...." రాజిరెడ్డి....

"పిలైతే మాట్లాడ్తాను...." శేఖర్ బయలుదేరాడు. మూడవసారి అటుకేసి వచ్చిన కొమురయ్య శేఖర్‌ను తీసుకపోయాడు.

* * *

రాజిరెడ్డి పొద్దున లేచిన దగ్గరినుండి మనుసు మనుసులో లేదు. పరిపరి విధాల ఆలోచించాడు....ఇంటిముందు ఎండబోసిన మిరుపకాయల్లో తల నెరిసిన ముసలమ్మ రాజిరెడ్డి తల్లి ఏన్నన్న తెల్లకాయలుంటే ఏరుతుంది...."వద్దురా కొడుకా అంటె వినకపోతివి....నీ మాట నీదేగాని ఇంకొలదినకపోతివి....పురుగు బుట్టదిని పుట్టలుండక మాదిగి మన్నేల, సబ్బండ వర్ణాల కుప్పేత్తివి....కులపోల్లకు కంటయితివి.... ఎంతకనిరా! మీ బాపు ఉంటె గిట్లుండునా?" కొడుక్కు విన్పించి, విన్పించకుండ గొనుగుతోంది....

ముగుణ కడలు దగ్గరికంటూ మిరుపకాయలు తవ్వే కోళ్ళను దూరం కొడుతూ భర్త వాలకాన్ని ఓరకంట కనిపెడుతోంది....

అరుగుమీద స్టీలు గ్లాసు నేలకేసి కొడుతూ పిల్లవాడు ఆడుకుంటున్నాడు.

రాజిరెడ్డి పరధ్యానంగా అద్దం ముందు నిలుచున్నాడు.

ఇంతలోనే వాకిట్లో చప్పుడయ్యింది....

"ఏందిర రాజాలు మళ్ళెం బట్టుకత్తివి...." రాజిరెడ్డి తల్లి....

"ఏముందవ్వా! ఏవో సంగపోల్లు రాజిరెడ్డి పటేలును పిలుచుకరమ్మన్నారు." సాకలి రాజయ్య నసిగిండు.

"ఏడాది నుంచి ఇల్లు తొంగి సూడనోల్లు—మల్ల రాజిరెడ్డి పటేలు మీద పావుర పడ్తండ్లు ఏందికత?...."

866

"ఏమో నవ్వ నాకేమెరుక?"—అనుకుంటనే కొంచెం ముందుకు నడిచి

"రాల చెట్టుకింద అంత జమయ్యిండ్లు. తమన్ని రమ్మంటండ్లు—"అన్నాడు అరు కింది నుంచే—

అదే సంగతి గురించి ఆలోచిస్తున్న రాణిరెడ్డి-నెత్తి దువ్వుకుంటున్న రాణిరెడ్డి "వత్తన్నపా." అన్నాడు.

సాకలి రాజయ్య వెళ్ళిపోయాడు.

సుగుణ కొడుకు నెత్తుకొని అరుగుకింద నిలుచున్నది....

"కారపు చేతులతోని పిలగాన్నెత్తుకున్నవ్ సీదర చేసుకుంటదే పిల్ల—" ముసలమ్మ....

సుగుణ మాట్లాడకుండా నిలుసున్నది. నిజానికి ఇదేదో దుమారం లేచేటట్లు గున్నదని ఆమెకు అన్పిస్తోంది. భర్త వాలకం తనకు తెలియనిదికాదు. తను అన్ని సంఘ కార్యక్రమాల నుండి తప్పించుకుంటున్నట్లు భర్త చెప్పగానే మొదట సంతోష పడింది తనే—రాను రాను ఊళ్ళో జరిగే సంగతులు—ఎందుచేతనో భర్త ప్రవర్త నలో వచ్చిన మార్పు మూలకంగా ఆ సంతోషం ఎగిరి పోసాగింది. ఊళ్ళో వాళ్ళ సూటి పోటి మాటలకు మొదట్లో రోషపడ్డది. కాని రాను రాను ఊళ్ళో వాళ్ళ మాటల్లో నిజమున్నదేమోనని అన్పించసాగింది. ఇప్పుడు భర్త ప్రవర్తనలో లోపాల గురించి తర్కించడమే తన పనై పోయింది. ఫలితంగా ఇద్దరి మధ్య దూరం పెరుగుతోంది. ఈ విషయాన్ని తనకు తెలియకుండా ఉంటే ఎంత బాపుండుననుకొన్నది చాలాసార్లు.

"నేను బయటకు పోతన్న—" రాణిరెడ్డి చెప్పులు వేసుకొని బయటకు కదిలాడు—

"కయిలాట్కానికి పోకు—" తల్లి—

"ఇగో జెరంత శాంతంగా మాట్లాడండి." సుగుణ చెప్పాలనుకున్న మాట గొంతులోనే ఉండిపోయింది. తను అక్కడికి పోవాలనుకున్నది—కాని తమ కులంలో ఆడోల్లు పంచాతులకాడికి పోవడమా? పోనీ అత్త నన్న పొమ్మందామను కున్నది—అత్తెట్ల పోగలదు? రాణిరెడ్డి వీధిలో కనుమరుగయ్యేదాకా అట్లాగే చూస్తూ నిలుచున్నది సుగుణ—ఆ నడకతీరు చూస్తుంటే నిజంగానే చాలా మధనపడుతున్న ట్లుగా తోచింది.

రాణిరెడ్డి రాలచెట్టు కిందికి చేరుకునేసరికి దాదాపు రెండు వందల మంది

నిలబడో కూర్చుండో ఉన్నారు—చిన్నపిల్లలు దుబ్బలో ఆడుకుంటున్నారు. కొందరు పళ్ళపుల్లలు ఇంకా నములుతూనే ఉన్నారు. మోటలు విడిచి వచ్చిన వాళ్ళ చేతుల్లో పారలు పగ్గాలు అట్లాగే ఉన్నాయి. మట్టికాళ్ళతో, పాసి మొఖాలతో మరి కొంత మంది వచ్చారు— స్త్రీలు కూడా చాలమందే వచ్చారు. మొత్తానికి చాలా మంది పనులమీది నుండే వచ్చినట్లుగా తోచింది.

రాలచెట్టు మొదట్లో పెంటయ్య మరికొంత మంది కూర్చున్నారు. పార్టీవాళ్ల ఆ మందిలో ఎక్కడన్న ఉన్నారేమోనని పరకాయించి చూశాడు. అన్నీ తనకు తెలిసిన మొకాలే—పెంటయ్యకు కొద్ది దూరంలో బోడగుండు రైతు మాత్రమే కొత్తగా కన్పిస్తున్నాడు—అతని బట్టలు వగైరా చూసి ఎవరి చుట్టమో అనుకున్నాడు.

అంతదాకా ధరవరల గురించో, మిరపచెట్ల కొరుకుడు రోగం గురించో, ముడుత రోగం గురించో, దిగుబడి గురించో మాట్లాడుతున్న రైతులు—పక్క ఊళ్లల్లో కూలీరేట్ల గురించి జరిగిన పోరాటాల గురించి, పోలీసుల గురించి మాట్లాడుతున్న రైతు కూలీలు, కొత్త పాటల గురించి మాట్లాడే యువకులు—రాజిరెడ్డి గురించి మాట్లాడే స్త్రీలు మాటాలాపారు.

రాజిరెడ్డి పిడికిలెత్తి అందరికి లాల్ సలామ్ చెప్పి రాలచెట్టు మొదలు కొరిగి నిలుచున్నాడు.

ప్రతిగా యువకులు పిడికిల్లెత్తారు—

ఇంతలో "తుస్ తుస్" మని తుమ్ముతూ "చిటచిట" కాళ్ళ చప్పుడు చెయ్యంగ మేకల మంద వచ్చింది—అంతమందిని ఒక్కదగ్గర చూసి బెదిరి వెనుకకు పరుగెత్తాయి. వాటి వెనుక జొట్టిరబోసుకొని కర్రలేపట్టి "ఉస్సో—టర్ర గ్యాగ" అంటూ మేకల మర్లేయడానికి గొల్ల గంగులు తంటాలు పడ్డాడు—

"తొవ్వలపెట్టి తొక్కకు మన్నట్టు జెరంత లేపుంల్లెహే"— ఎవడో ముసలివాడు—

మంది లేచారు — మేకలు వెల్లిపోయాయి —

అంతమందిని చూసి వెనుకకు పోయి గట్టుపకింద కట్టెపెట్టుకొని గొల్ల గంగులు నిలుచున్నాడు....

"వారీ గంగులు సువ్విక్కడ మందిల నిలుసుంటె మేకలు పొయ్యి సత్తె నాశనం జేత్తయి." మందిల నుంచి ఎవరో

"ఓ నీయక్క.... సంగపోల్లు మీటింగువెడితె పట్టపగటించి పెడితెట్ల- మేం ఇనాల్నా అద్దా! రాత్రి పెట్టాలెగని...." కాళ్ళెగరేస్తూ చేతులాపుతూ పరుగెత్తాడు....

గొల్లగంగులు అన్నమాట గురించి ఆలోచిస్తూ "అందరచ్చినట్టేనా ?" పెంటయ్య లేచి నిలబడి అందర్నీ చూస్తూ అన్నాడు.

"అచ్చినోల్లచ్చిరి-రానోల్లు రాకపెయిరి. బొట్టు పెట్టి పిలిసేటందుకు గిదే మన్న పెండ్లా పేరంటమా! లేటున్నోడు తోట పెట్టుకుంటడు కానియ్యండ్లి" అమ్మోరు మచ్చల మొఖపాయన లొడ లొడ చెప్పిండు.

"గట్లంటెట్ల తాత- గిది మన పంచాతు. అందరు రావాలె—"ఒక యువకుడు.

"ఏదచ్చినోడు సుత రావాల్నంటవోయ్ బామ్మర్ది" బింగి చెవుల కైతికాల పుల్లయ్య.

అందరు నవ్వారు...."పోయ్యెరా పో పుల్లన్న....మల్ల పంచాతు" దూరంగ కూర్చున్న నారయ్య.... మళ్ళీ నవ్వులు....

పెంటయ్య లేచి నిలబడ్డడు.... అతనికి మద్దతుగా క్రెగాతునికి మొద్దులా గున్న సుంకరి లింగయ్య "సైసుండ్లి-సైసు" అంటూ చెతూలాపాడు.

"కామ్రేడ్లు...." పెంటయ్య కోడి బొక్క గొంతిరెల అడ్డం పడ్డట్టుపట్టి అన్నాడు....

"ఓర్నీయవ్వ గిదేందిర్ర రెడ్లతీర్గ— కామ్రేడ్లు అనవయ్యా" ఓ రైతు సలహా యిచ్చాడు—

"పదిమందిల పాము సావదన్నట్టు—సెప్పేదేదో వినకుంట మజ్జల ఏందుల్ల—" గౌరక్క చేతులు చాపి చెప్పింది—

"ఓనీ బాంచెనాతె గౌరక్కతల్లే—" మరొకడు—

"నవ్వులాట గాదు. జెరంత అంత మనసు పెట్టి ఇనండ్లి-మీకు సెప్పేదా మని ఏదన్న తోత్తే చెప్పండ్లి- మల్ల చెప్పేటప్పుడు ఒక్కొక్కలే చెప్పండ్లి- ఆయింక సంగపోల్లు మమ్ముల మాట్లాడనిచ్చిండ్లా అంటె కలువది" పెంటయ్య మాట పూర్తి కాకముందే—

"ఓ.... సంగపోల్లు పిలుత్తండ్లంటె ఉరికచ్చిన- రాపోతే మల్లెండ్ల కలిసిండో అనుకుంటరనచ్చిన—నాకైతె ఏ మెరుకలే" ఒక హరిజన ముసలయ్య చేతులెల్లక చేసి అన్నాడు.

పెంటయ్య ఆ మాట వింటూనే ఎవరెవరు రాలేదోనని ఓపాలి కలియ

869

చూశాడు—అందరొచ్చారుగాని, మధ్యతరగతి రైతు ఒక్కలన్నా కనిపించలేదు– "కాపోల్ల వాడకట్టు నుంచి కందులోల్ల కనకయ్య, గొల్లోల్ల మల్లన్న, పల్లెమీని నాంచారి, గౌండ్లీరయ్య. బుచ్చిరెడ్డి, ఈరసామి-ఎవలు రాలే— ఏందికత ?" అన్నాడు.

"ఆల్లంత మద్దె తరగతి రైతులు గద-" అన్నాడు రాలచెట్టు పక్కనుండి ఒకడు.

"గిదీ అందరికి కావాల్సిన సంగతి- మద్దెతరగతోల్లు కూలోల్లని ఏంలేదు. తలో దిక్కు పొయ్యి పిలువుండ్లి నేను పెర్కోల్ల ఈరసామన్నను పిలుసుకత్త"- వెంటయ్య వీరసామిని పిలువబోయాడు—మరికొంతమంది తలోదిక్కు పిలువక రాను పోయారు.

"రాజిరెడ్డిని పంచాతుల బెట్టిసంగదా !" అన్నాడెవడో—

"మనమెందుకు బెట్టిం- అతగాడే మనల పిలిసిండు" ఇంకొకడు.

"గ సమ్మిరెడ్డి నిన్న బుచ్చిరెడ్డిని పిలిసి- ఇగో రైతు కూలి సంగమంటే జబ్బలెగిరేత్తిరి- మాదిగిమన్నేలను కుప్పేసి మన మీనికి ఉసిగొల్పుతరంటె ఇన్నరా ? నా మాటెక్కడింటరు ? రాజిరెడ్డిని పంచాతుల బెట్టిండ్లా లేదా ? ఇగో రేపు—" గుసగుసగా బరుపటి రాజయ్య పక్కనున్న వానితోని చెప్పాడు—

"సాపు కబురు సల్లంగ చెప్పుతున్నవ- గిసొంటి ముచ్చట కడుపులుంచు గాదు—" పక్కనున్న ఏల్పుల గట్టయ్య.

రాజిరెడ్డి ఎవరెవరు ఏం మాట్లాడుతున్నారోనని చూస్తున్నాడు—నిలబడితే అందరు తనదిక్కే చూస్తున్నట్లుగా గమనించి రాలచెట్టుకింది బండమీద కూర్చున్నాడు-

"మరి నాకెర్క లేకడుగుత-పెద్దోల్లు-బొర్రగలిగినోల్లసు రాకపోతే మనుషులు బోయిండ్లు గని మరి తెనుగోల్ల శంకరి, ఏల్పుల పెదెల్లు మామ రాలే— ఆళ్ల కూలోల్లని పిలువబోలేదా ?" అన్నాడు పనివొంగ నత్తోడు.

"నత్తోడు మందిల పిత్తుతడు— తీరిపారికూకుండి అంటున్నవ్ నువు పోయి పిలుసుక రాపోతివి" పక్కనున్న ముసలయ్య.

ఒకామె కిసుక్కున నవ్వింది- నత్తివాడు నోరుమూసుకున్నాడు. ఆడవాళ్ళు గుసగుసగా మాట్లాడుకుంటున్నారు. చాటకొకడు కొంచె మాటంటండు—పదినిమిషాలట్లా గడిచినయ్.

870

"గౌండ్లీరన్న కాలు బెనికిందట-రాలేసుకు కొరనెమించన్నడు" అన్నాడు అతని దగ్గరికి పోయొచ్చిన వాడు.

"లంజెనకురాలు— ముదుగాలు ఎవలెవలచ్చింట్లని అడిగింతాలేదా ?"

"బుచ్చిరెడ్డికి తోట కాదెవలు లేరట—" ఒకరు.

"మనందరికి ఉన్నరా ?" మరొకరు.

కందులకనకయ్య, గొల్లమల్లయ్య, నాంచారి, వీరసామి వచ్చిండ్లు.

"నా కొడుకుతోడు. ఇగో గిప్పుడు మనిషచ్చి చెప్పేదన్క గిట్లసంగతని నాకెర్కలేదు" నాంచారి అనుకుంటచ్చింది.

"ఏదో రాజిరెడ్డిమీద పంచాతంటె నేనుండేంది లేకుండేంది పెద్దలంత ఉంటరు గదా అనుకున్న" కనకయ్య.

"గట్లంటవేమె— నువ్వు గాక మాకు పెద్దెవలున్నరె-" మన్నెపోల్ల సుక్కపోసు—

"నాదేమున్నది బిడ్డా!" కనకయ్య ఓ రాయి చూసుకొని కూకున్నాడు— ఎందుకైన మంచిదని భుజాలు చిరిగిన బనీను వేసుకొచ్చాడు.

పెంటయ్య మందిలో నిలబడి "కామ్రేడ్లారా" కొద్దిగా తడబడి సరాంచి మనం సంగం బెట్టిన కాన్నుంచి సానా పంచాతులు సేసినం. దొరలను నిలదీసి అడిగినం— దండుగలు వాపసు దీసుకున్నం. గీ పంచాతు సేసుడు దొరల సేతుల్లుండె—అళ్ళ సేతుల్ల నుంచి గుంజుకొని దొరల పంచాతుల బెట్టుడే గాక మనండ్ల మనం తగాదాలత్తె దీర్సుకున్నం—" కొంచెం సేపాగి— "బాంచెననుకుంట తిరిగినోల్లం బరిగీసి నిలిచిన మంటె— గీ పంచాతుల్ల మనందరి తోటట్టు రాజిరెడ్డి ఉండి నడిపించాడు—కనిగీ పంచాతుల రాజిరెడ్డి మీ ముంగట కూసున్నడు—గీ పంచాతికి ఊళ్ళోల్లను పిలిపించిన సంగతేందో రాజిరెడ్డే చెప్పుతడు" పెంటయ్య కూర్చున్నాడు—

"నేను బిలువలే—" రాజిరెడ్డి ముఖమంతా జేవురించగ అన్నాడు.

"మరయితే మా కందరికి పనిపాట లేకచ్చినమా ?" ఆడోల్లల్లో నుంచి ఎవరో గునిసారు.

"ఏందయ్యో యేల్లగానినేల్ల గోపాల్లం బాడినట్టు ఊకినె మమ్మల్నెందుకు

871

విప్పి త్తివి పెంటయ్య” రామకిట్టు ముడ్డికింద పంచె దులిపి లేచి పోవడానికి సిద్ధమయ్యాడు—అతనితోపాటు మరికొంత మంది లేచారు—

పెంటయ్య నీలయ్య ముఖం చూశాడు. నీలయ్య కళ్ళతోనే చెప్పమన్నట్లు సైగ చేశాడు.

“కూకోండ్లి-కూకోండ్లి- సరే ఎవలు పిలిసినా పిలువకున్నా మనం కుప్ప కూడినం- సంగతి మాత్రం రాణిరెడ్డి మల్ల మనతోటి కలుసుడా లేదా అన్నదే? ఆ ముచ్చటేదో అయినె చెప్పితె మనం ఉండుడో పోవుడో తెలుత్తది-” పెంటయ్య చెప్పి కూకున్నడు.

రాణిరెడ్డి లేవలేదు.

మందిలో నుంచి ఒకలు లేచి “అంత గనం అయినెకే పట్టింపయితె- ఒలిమిటికి లింగం గడితె బత్తుడైతదా! లేండ్లి లేండ్లెహెఁ” అన్నాడు.

సగం మంది లేచారు.... తలోమాట అన్నారు.

అప్పుడు రాణిరెడ్డి లేచి నిలబడి “కామ్రేడ్సు- కూర్చోండి- నేను ఆలోచించేది ఇది సరైన పద్ధతేనా అని- ఇలాంటి విషయాలు ఇంతమందిలో పరిష్కరించవలసినవేనా అని నేను ఆలోచిస్తున్నాను- ఆ విషయం తెలిసిన వాళ్లు దీని గురించి చెప్పితే- నా సంగతి నేను చెప్పగలను-” ఇలాంటి విషయాలు ఎవరు చెప్పలేరనే ధీమాతో కూర్చున్నాడు.

నీలయ్య పక్కనున్న అయిలయ్య లేచి- “రాణిరెడ్డి ఇంతవరదన్క పని జేసింది మనూళ్లె- మనతోటి- మనండ్ల మనకేదన్న అత్తె పజల ముంగట్నే తేలి పోవాలె ... వుండో కాదాయితె మందో కాడ బెట్టుడుగాదు ... గిది పద్ధతేనని నాకన్పిత్తంది.” అన్నాడు.

మందిలో నుండి ఒకడు లేచి- “నాకెరుక లేకడుగుత- గీ ముసుగుల గుద్దు లాటలేంది- గిది గుర్రం గిది మైదానమని చెప్పరాదుండ్లి-” అడిగిండు.

పెంటయ్య లేచి చెప్పుదామనుకునే సరికి రాణిరెడ్డి లేచి “కామ్రేడ్సు- పద్ధతేనని మన అయిలయ్య చెప్పిండు.... సరె! పద్ధతైనా కాకున్న నేను నాకు సంబంధించిన కొన్ని విషయాలు మీ ముందుంచుతాను. మన అయిలయ్య చెప్పినట్టుగానే మంచికో చెడ్డకో మనూళ్లె రైతుకూలీ సంఘం బెట్టినం- మనం ఎన్ని పోరాటాలు చేశామో? ఏమేమి సాధించామో? ఎన్నిసార్లు దెబ్బలు దిన్నామో? జేల్లబడ్డమో! అవ్వన్ని మీకెరికే.... ఈ పోరాటాలన్నింటిలో నేను ఊళ్ళోల్లందరితో పాటు

ఉన్నాను...." కాసేపాగిండు.... ఆలోచిస్తున్నట్లుగా అతని ముఖం చెప్పుతోంది. గొంతు కొద్దిగా మార్చి "నా వ్యక్తిగత కారణాల మూలకంగా గత ఏడాది నుండి నేను సంఘ కార్యక్రమాలల్లో చురుకుగా పాల్గొనలేకపోయాను. నామీది కేసులు అట్లాగే నడుస్తున్నాయి.... మళ్ళీ ఆలోచించుకున్న తర్వాత సంఘం తప్ప వేరే మార్గం లేదని మళ్లీ ఎప్పటిలాగే మీతో కలిసి పనిచేయాలనుకుంటున్నాను. మీరు సరేనంటె నా ఆఖరి శ్వాసదాకా కష్టంలో సుఖంలో మీతోపాటే ఉండాలని అనుకుంటున్నాను... ఇంతకు మించి నేను చెప్పవలసిందేమి లేదు." రాజిరెడ్డి కూర్చున్నాడు.

జనంలో కలకలం లేచింది.

"నింద మంచి సలిపెత్తందా అన్నట్టున్నది."

"ఎప్పుడిట్లమైతే గప్పుడు పోపుడు- మల్ల కష్టమచ్చినంక కలిసేటందుకు గిదేమన్న దొరల పార్టా !"

"ఎంతైనా కులం కులం ఒక్కటి."

"ఏమో ఈ వరకే మన సంగతులు దొరలకు మోయలేదని గారంటేంది ?"

"సనుసన్రు లొట్టమీది కాకులోలె- అంతమంచిగనే చెప్పిండ్లు గని-ఎక్తిగత సంగతు లేందో చెప్పలేదు."

ఇట్లాతలోమాట ఎవరికి తోచినట్టు వాలే- గుసగుసగా, లొడలొడగా, బొంగురుగ అనసాగిండ్లు—ప్రతిమనిషి ప్రశ్నించాడు.... అట్లా కాసేపు జనాన్ని తర్జన భర్జన పడనిచ్చి ఏదో మాట్లాడుదామని పెంటయ్య లేచాడు—జనం మాటలాపారు.

మందిని తొలిగిచ్చుకొని గుడిసె చూరుకింద నుంచి ఒక ముక్కుపుల్లగల సన్నటి కురుచస్త్రీ ముందుకొచ్చింది.

"నలుగుర్ల మాట్లాడిందాన్నిగాను... అందరు మాట్లాడంగ నాకోమాట అడుగాలని పిచ్చింది. అయ్యా రాజిరెడ్డి పటేలా ! మీరున్నరని ఓడెక్కినం—ఓడ నడి గంగలకు పొంగనె తెప్ప (అల) చ్చింది నిండ ముంచింది—ఆఖరుకు తమరు ఒడ్డు మీద నిలుసుండి మీకే బయంలేదు వాలేసి దేపుతనంటండ్లు-" అన్నది కంఠం వొనుకుతుండగా....

"ఏమంటందిర్ర బెస్తోల్లరామక్క—" ఒక యువకుడు. 873

"ఓడ దాటినంక బోడ మల్లప్ప అంటన్నవ్ అంటంది" పక్కనున్నవాడు...

"మంచిగడిగినవ్ కోడలా!" మందిలోనుంచి పెయికంగి లేని ఒక్క ముసలోడు మెచ్చుకున్నాడు.

"రాజిరెడ్డి మల్ల మనతోని కలిసి పనిజేత్తనంటండు. తీసుకుందామా వద్దా ఒక్కలొక్కలే నిలుసుండి చెప్పుండ్లి" పెంటయ్య.

ఎవలు లేచి చెప్పాలని అనుకుంటుండగానే రాఘవులు అనే రైతులేచి నిలబడి— "మంచిమాట జెప్పినవయ్యా సంఘంపెట్టె—ఎందుకు మానుకున్నడో అడుగద్దు—మల్లెట్ల మనమీద పాపురం గాలి పోయిందో అడుగద్దు— ఏకొదమ్మున తీసుకుందామా వద్దా అంటె ఎట్లానయ్యా" అన్నాడు.

నాంచారి లేసి.... "ఊకే కొలువా తుమ్మరియ్య—కొలుపు బెట్టి చెప్పుతంటె తలుపు బెట్టి అడుగువట్టిరి.... తప్పుకున్న కొద్ది పెంకలు దప్ప బాగ్గెంరాదు— రాజిరెడ్డి సంగానికేమి చెడుపు చెయ్యలేదు గదా! సాతనైనంత సేపు ఉన్నడు— సాతగానప్పుడు తన సందాల తనున్నడు—గిందట్ల కోపతాపాలకేడ తావున్నది.... ఇగో నాకు దోసిన ముచ్చెట చెప్పిన—" కనుబొమలు ముడుచుకొని కూర్చున్నాడు.

మల్ల రాఘవులు లేచి "నువు సల్లంగ జారుకొని ఎన్నెల్లయ్యిందయ్యా—" రాజిరెడ్డికేసి చూయిస్తూ....

రాజిరెడ్డికి సర్రున కోపమొచ్చింది. తమాయించుకొని "ఈడ కూసునోల్లు సంగంల ఏమేమి చేసిండ్లో నాకెరికే—గ చరిత్రంతా చెప్పేటందుకు గిది జాగగాదు- ఏడాదయ్యిందని ముందుగాల్నే చెప్పితి గదా...."

"అగో గిప్పుడే మారిండన్నరు—మల్ల ఎవలెవలు ఏమి చేసిండ్లో చెప్పుతనంటండు—చెప్పవయ్యా ఎవరి గురించి తప్పు జరిగినా విచారించాలే-" ఒక యువకుడు గట్టిగా అంటూ వాదనకు దిగాడు.

అప్పటిదాకా మాట్లాడకుండా కూర్చున్న మెంట ముసలివాడొకడు లేచి— "ఇగో మాటలు చేసుకుంటె కాకుంటె తెగది బలువది—ఏడాదయ్యింది గద—గీ ఏడాదిల అతగాన్నుంచి మన సంగానికి గాని ఊళ్లోల్లకు గాని ఏదన్న చెడుపు జరిగిందా లేదా అన్నది ఇసారం చెయ్యుండ్లి—ఉనుక దంచుతెట్ల?" అన్నాడు.

బెస్తవాళ్ళ రామక్క చెప్పవలసిన మాట పూర్తికాక అప్పటి నుండి అందరి ముఖాలు పులుకు పులుకున చూస్తూ అట్లాగే నిలుచున్నది.... ఆ ముసలివాడు అట్లా అనగానే అందరు గత ఏడాది నుండి ఊళ్లె జరిగిన సంగతులు గుర్తుకు తెచ్చుకుంటున్నారు. అప్పుడు రామక్కకు సందు దొరికింది.

రామక్క కొద్దిగా గొంతుపెంచి "మల్లె మన్నోలె— సెరువుల సాపలోలె బతికిన మనూల్లెకు పదాలు దెచ్చింది రాణిరెడ్డి పటేలే. కని మద్దెల ఏమయ్యిందో ? మాసుకున్నదో లేదో నాకు ఎరికలే ఆరునెల్లే అయ్యిందో ఎక్కవే అయ్యిందో నాకు మతికిలేదు కని— పొద్దుగూకి గప్పుడే సీకటి సీకటి బడంగ మా వాడకట్టకు జీబచ్చి ఆగింది.... మల్లేం పీడచ్చిందిరో— పోలీసోల్లు దిగిండ్లని నా పానంల పానం లేదు— తొంగి సూత్తినా జీబుల తెల్లబట్టలోల్లు దిగిండ్లు.... పోలీసోల్లు గాదని ఈతలి కచ్చిన ఆ ఎనిమిది మంది మా వాడమీద దొంగల తీర్గబడి బంపోత్ బట్టీలు బెట్టిండ్లని గుడిసెల్ల జొరబడి కుండలు గురుగులు తొక్కిండ్లు— దొరికినోల్లను గొడ్లను గొట్టినట్టు గొట్టిండ్లు— అంగామంగామె జేసిండ్లు— మా వాడకట్టుకు ఆళ్ళ పంచెలే ఆళ్ళ దండలకు గట్టి పదిమందిని తీసుకపోయిండ్లు— కేసులు బెట్టిండ్లు...."

"ససరాదే తొందురుదాన—" మందిలో నుంచి రామక్క ఖర్త గంగులు అడ్డం పోబోయారు....

"ససువయ్య సను—నా కడుపుల సొద ఎల్లబోసుకోనియ్యి—మా అయినెను తాన లేసిండ్లు— నేను లబ్బ లబ్బ మొత్తుకుంట అకీలు దగ్గరికురికిన—ఆని తాడు దెంప ఆడు నన్ను బెదిరిచ్చి అయిదు నూర్లు తెమ్మన్నడు....ఓరి దేవుడో! గిప్పుడు ఏడబోదు— పానమాగక ఉరికత్తిగని— గపెంటన్నన్న ఎంట బెట్టుకరాపోతి— గరాణి రెడ్డి పటేలు నన్నఎంట బెట్టుకరాపోతిననినా ఆండ్ల నేనే ఏడ్సిన ఎటు సాతగాక మనూరి సంగతి అకీలుకు జెప్పుతే ఏమన్న గురుత్తం జూత్తదేమోనని రాణిరెడ్డి పటేల్ పేరు జెప్పిన....అయినె కిసుక్కున నవ్వి "మీవూరి రాణిరెడ్డి మాపులల ఇస్పెదారన్నడు—" ఇగ నేను నోరు మూసుకొని కాళ్ళ కడాలు, చేతుల కడాల అమ్మి అయిదునూర్లు ఆనిగొమ్ముకు బెట్టిన ..." రామక్క ముక్కు చీదింది ...

రామక్క మాట పూర్తి కాకముందే మాదిగి కొండయ్యలేచి— "గంత దూర మెందుకయ్య పదిహేనొద్దుల కింద మిరుపకాయలే రేటెందుకు కూలి బెంచాల్నని మనం సమ్మెజేత్తె వీళ్ళవ్వ మాదకుల బట్టుకపోయి తోపేరిపిచ్చుకున్నది....గిది సంగానికి దెబ్బ కాదా!" చెప్పి వెనుకకు తిరిగిపోయి తన స్థానంలో కూర్చున్నాడు. కూర్చున్న తరువాత గాని తను చెప్పవల్సింది మరిచిపోయానని తెలియలేదు. మళ్ళీ అక్కడి నుండే లేచి "మారేనయ్య— మేం సానామందిని సూసినం— తాపకు సదువు

875

కున్న మారాజులు కుంటిగులాపులందర్ని కుప్పేయ్యటం. అది చెయ్యండ్లి—ఇది చెయ్యండ్లనుడు—మేం బజార్లకు రాంగానే ఆళ్ళదారి ఆళ్ళ సూసుకునుడు—మారేనయ్య మీ ఎక్కువోల్లంత మమ్ముల మంచుతండ్లు—పేరొకలది—ఊరొకలది.... లేపోతే రాజిరెడ్డి పటేల్‌కు సారా మాపులల ఇస్స డొరుకునా!"

"కోరే కొండ—నోటికెంత మాటొత్తె అంత మాటేనురా?" అంకరి మల్లయ్య అడ్డొచ్చాడు....

"సువ్వట్లాగురి మాట ...నువ్వెప్పుడు గిట్లనే మా నోరుకు కుట్లేత్తన్నవ్.... రాజిరెడ్డి మనల మంగచేసుకొని తాత్ దీట్టని తిరుగపటికెనే గదా! ఆయనోన్ని పెద్ద నాయకునుకుడన్నరు ...తనకు బతుకు దెరువున్న దనేగదా! మనలందర్నిడిచి సెంగో బిల్లన్నడు...." కొండయ్య పూర్తి చేసి కూర్చున్నాడు—

అంకరి మల్లయ్య పెదువులు నాక్కొని లేచి నిలబడదామనుకున్నాడు. కాని ముడ్డిపేగంత చిరిగిందని బిడియపడి మందిల కూర్చుండే— "ఏర్గ బొయి బోర్లబడి ఊరు నాకై రాదనకుండ్లిరా— సంగం మనకు మొసనోసిందిరా. అయ్యల్లాలా అనితో నేంది గులాపోన్ని బాంచెన్.... కోపం చెయ్యకుండ్లి నేను పాతకాలపు కమినిట్లని చూసిన—ఆళ్ళ తుపాకు లేసుకొని ఇజ్జం చేసిండ్లు బాంచెన్ ...మనూల్లె సుత భూములు పంచిండ్లు బాంచెన్....ఇయ్యల్ల ఆల్లెక్కడున్నరు బాంచెన్ ....పాతదొరలు పోయి కొత్త దొరలయిపోయిండ్లు ...కాలాల బట్టి దొరలు ఏషాలు మారుత్తరు బాంచెన్ ....గది ఇసారం చెయ్యండ్లి. మాదిగోడు, గీడు కాపోడు అని మనండ్ల మనం కొట్లుకస్నావద్దు....బేపారంల దిగినంక ఎంత కమినిట్టయినా లేనోల్ల కడుపుల మీదనే కొడుతదు బాంచెన్—గబుద్ది పుట్టిందంటే గంతేనయ్యా!" అంకరి మల్లయ్యకు ఇక ముందు ఏం చెప్పాలో తెలియలేదు.

ఎక్కువోల్లు, తక్కువోల్లు అన్నందుకు పెద్ద రగడ జరుగవలసిందే కాని అంకరి మల్లయ్య సదిరి చెప్పటంతోటి ఆగిపోయింది.

"ఇగో మా తాత సచ్చేలోకానున్నడోగాని, చెప్పులున్నోనెంట—అప్పులున్నోనెంట—సదువుకున్నోనెంట పోవద్దని చెప్పిండు" అన్నాడో గూనివాడు.

"అవ్వో వంపయితె మరదలు మిట్టయితె వదినెగాదు." ఒకామె. చర్చ పక్కదారి పట్టడం చూసి నీలయ్య లేచి నిలబడ్డాడు.

"కామ్రేడ్స్! మాది కర్నాగురం (కరీంనగర్) జిల్లా—మీ పూరికి [illegible] మార్గంలచ్చిన—మా పూళ్ళల్ల సుత సంగాలు పెట్టుకున్నం....బుద్దాగక మీ సంగపోల్ల

సంగం జూద్దామని ఈడికచ్చిన. మీరింత దసుక మాట్లాడిన సంగతులిన్నంక నాకు సుత కొద్దిగ మాట్లాడన్ననిపిచ్చింది.” తలగోక్కొని “మనండ్ల మనకు ఎన్నో కిందా మీదులున్నయి. కులాలు, ఎక్కువ తక్కువలు సానున్నయి. గది దినాముండే భాగోతమే. గియ్యన్ని బోవాల్నంటె ఇప్పుడికిప్పుడే దూరమైపోవు....గియ్యన్నిటికి కారణం దొరలు—వాళ్ళ సుట్టూ పరుసుకున్న భూమి—దొరలను ఊళ్ళల్ల నుంచి ఎల్లగొట్టినం—కని ఆళ్ళ జాయిజాదులు అట్లనే ఉన్నయి. దొరలకు మద్దతుగ పోలీసులు ఊళ్ళమీన బత్తనే ఉన్నరు....దొరతనం బోవాలంటె ఆళ్ళకు మద్దతిచ్చే పోలీసోల్లు బోవాలె-సట్టాలు బోవాలె-గియ్యన్ని బోవాన్నంటె మద్దెతరగతి రైతుల కాన్నుంచి పల్లెలున్న బీద బిక్కి సంగంల ఒక్కటి గావాలె—పట్నాలల్ల పన్జేసి బతికే కార్మికులు మనతోకలిసి పోరాడాలె—అట్ల పొలాలల్ల పనిజేసెటోడు—మిల్లుల్ల, బాయిల్ల పని చేసేటోడు అన్ని సీజ్‌లు తయారు చేసేటోల్లంత కలిసి దున్నెటోనికి భూమి, నడిపెటోనికి మిల్లు అచ్చేదనుక లఢాయి చెయ్యాలె ...ఉత్త సేతులతోని గాదు—తుపాకులతోనే కొట్లాడాలె—ఇగో గట్ల చేసే లఢాయిల ఎన్నో సంగతు లుంటయి, అయ్యన్ని తీర్మానం చేసుకొని ముందట బడితేనే మనం గెలుత్తం.... ఇగో మీ పూల్లె రాజిరెడ్డి అసొంటి సంగతే అత్తది. అయినేదో బేపారం చేసుకుంటని చెప్పిండ్లు—గీ ఏడాది బట్టి మీ పూల్లె సంగం సాన పోరాటాలు చేసింది—గండ్ల రాజిరెడ్డి కలిసి రాలేగదో సంగతి—పోగా రాజిరెడ్డి ఆసర సూసుకొని మీ యిండ్ల ల్లకు జీప్‌కారోల్లు వచ్చిండ్లని ఓ అక్క చెప్పుకచ్చింది. ఇంకో పెద్దయ్య ఎనుకటి నుంచి గిసొంటోల్లు పజలను పోరాటంలకు దించి ఆప్న బేపారాలు జూసుకొని—మరి కొన్ని ఊళ్ళల్ల ఓట్లల్ల దిగి కొత్త దొరలయ్యిండ్లని చెప్పుకచ్చిండ్లు ఇయ్యేల్ల రేపు కమినిట్లల్ల నుంచే కొత్త దొరలు బయలెల్లుతరని పెద్దయ్య సెప్పబోయిండు అంతే కాదు పెద్దయ్య ?” ఓమారు అంకరి మల్లయ్య కేసిచూసి—

“ఇయ్యన్ని ఒకెత్తు రాజిరెడ్డి ఏ సంగతులల్ల తనకు సాతగాలేదో—గీ ఏడాదిల మల్ల మనుసెట్లా మారిందో సెప్పనేలేదు—నాకో సిన్న అనుమానం—రాజి రెడ్డి నిచ్చెంగానే మారిండా? అయితే రాజిరెడ్డే చెప్పుడు బాగుంటది.” నీలయ్య కూర్చున్నాడు.

“లాపోడేనేమే” అన్నారు ఆడోల్లు-

రాజిరెడ్డి లేవలేదు-

“చెప్పాలె- చెప్పాలె-” అన్నారు యువకులు.

877

రాజిరెడ్డి బలిమిటికి లేచి నిలుచున్నాడు. అతనికి కాళ్ళకింద భూమి కదిలి పోతున్నట్లుగా ఉన్నది....పార్టీవాళ్ళ నిజంగానే తనను మోసంచేశారు....గిట్ల మూగియ గలదనుకుంటే అసలు తను ఈ పంచాయితికే రాకపోవును....పార్టీ అంత రాలు పాటించాలి. ఎవరినెక్కడ విచారించాలో ఆలోచించాలి....కాని తానుగాని, పార్టీగాని, ప్రజలకోసం, ప్రజల్లో పనిచేయాలని, నిజమైన విప్లవ బోధకులు ప్రజలే అన్న సత్యాన్ని రాజిరెడ్డి గుర్తించడంలేదు -జీరబోయిన గొంతుతో...."నిజానికి నా వ్యక్తిగత కారణాలను చెప్పుమని బలవంతం చేయడం దాదాపు అంతా పదే పదే కోరుతున్నారు. ఈ వూళ్లో మొదట అరెస్టయ్యింది నేను.... నేను ఇప్పటికి పుచ్చిన కుక్కలాగా కేసుల చుట్టూ తిరుగుతూనే ఉన్నాను. కేసులకు డబ్బు కావాలి....సంగంలో పనిచేయనప్పుడు నాకు ఉచితంగా పని చేయమని ఏ వకీలును కోరాలని పించలేదు.... మిత్రుల బలవంతం మీద సారా మామూలలోకి వెళ్ళాను.... గత ఏడాది చింతకింది రామలచ్చులు భూమి దున్నించినపుడు మాధవరెడ్డి గుండాలు కొట్టి కోలాట మేసిండ్లు.... ఇప్పుడు నన్ను ఇంత నిలదీస్తున్న సంఘం అప్పుడు కనీసం ఒక ప్రదర్శన చేసిందా? ఒక కరపత్రమన్నా వేసిందా ? సరే ఎవరిని నిందించి లాభంలేదు—ఇలాంటి సంగతులు జరిగిపోయినయ్.... వాటన్నిటి గురించి ఇప్పుడు ఆలోచించి లాభంలేదు.... మరింక నేను చెప్పవలసిందేమి లేదు...." గబుక్కున కూర్చున్నాడు.

సాకలోల్ల రాజమ్మలేచి "మొన్న సుగుణవ్వను ఎటువడితే అటు గొట్టిండు" అన్నది.

"ఇగో మొన్న గిదంత నేనేసేసిన మీదేవున్నది అన్నడు" మందిలో నుండి ఒకడు—

"అటు దగ్గరికి దీత్తరని దొరల సోపతి బడితే వాళ్ళ ఎంతటోన్ని అంతట్లనే ఉంచిండ్లు— రిణసూడబోతే బాలసంగపోల్లు ఇజ్జత్ దీత్తండ్లు— మారే మరింక వేరుంటే పడుతలు లేదని పెద్ద పెద్దోల్లతోని రాయబారాలు నడిపిండు" కొండయ్య పక్కనున్న అయిలయ్య.

"ఓర్నీయవ్వ కాలాంతకుడే—అయితే పోల్లగండ్ల బాధకు రాయబారం బెట్టిండు గని నిజెంగ మారలేదన్నమాట."

ఇట్లా చాలామంది రాజిరెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడారు. రాజిరెడ్డి ముఖం నేలకేసి కూర్చున్నాడు.

పెంటయ్య లేచి— "ఆఖరి మాటల్లో రాజిరెడ్డి సంగంమీద సిన్మ సిందే

878

సిండు....అప్పటికే రైతుకూలీ సంగపోల్లంత జేల్లున్నరు. అయినా రాజిరెడ్డి గన్క తలుసుకొని ఊళ్లోలందర్ని జమజేసి మొత్తం భూమి దున్నియమందె— అదిచెయ్య లేదు. గీలడాయిల ఎవల మెంత కష్టబడ్డమన్నది లెక్కలేసుకుంట పోదామా? లెక్కలేసుకొను గిది ఒక్కల కోసం జరిగే లఢాయిగాదు....గీడ కూకున్న అక్కలు సెల్లెండ్లు, తల్లులు, తండ్రులు సంగం బలపడేటందుకు ఎంతెంత సేసిండ్లో కరీదు కట్టేదెట్లాగా? లెక్కలు తీసేదెట్లగా- గీలడాయిన కొడుకులిచ్చి నోల్లున్నరు.... బిడ్ల సాగనంపినోల్లున్నరు.... లాభాలు, నట్టాలు లెక్కలు గట్టేటందుకు గిది కోమటి బేరంగాదు—ఏదో వత్తదని ఆశపడ్డ రాజిరెడ్డి తన సంగతి బయట పెట్టిండు—ఇగో గది గుర్రం గిది మైదానం-మరింక రాజిరెడ్డి ఏం చేద్దాం" పెంటయ్య అందరికేసి చూస్తూ అడిగాడు....

అప్పటికి నెత్తిమీదికి పొద్దచ్చింది. చింత చెట్టుమీద పిట్టలు చేరిపోయాయి. ఆడుతున్న పిల్లలు ఎప్పుడో వెళ్ళిపోయి తల్లుల దగ్గర నిద్రపోయారు....

"ఒక్కసారి సంగాన్నిడిసి బోయినోల్లను తీసుకోవద్దు—అందట్ల రాజిరెడ్డి నసలే వద్దు" అందరు మొత్తుకున్నారు. కొంతమంది కోపమాపుకోలేక పేరు పెట్ట కుండ తిట్టారు.

అంకరి మల్లయ్య లేచి నిలుసున్నడు. ఇప్పుడతనికి చిరిగిన ఒంటి పేగు గుర్తుకు రాలేదు "ఊళ్లోల్లందరు సెషామంటె పెషామంటండ్లు— గిప్పటికి అందరి మాట గదే— కాని సంగం గట్ల అందరిని దూరం కొట్టుకోదు— అయ్య సంఘం మనకేమి సేసిందని అడిగే ముందు—మనం దానికేం జేసినమని గుండె మీన సెయ్యేసుకోవాలె— అది మన కన్నతల్లసొంటిది—కడుపుల బెట్టుకున్నంతసేపు పెట్టు కుంటది— తిట్టేటప్పుడు తిడ్తది.... దగ్గెరకు దీసేటప్పుడు దీత్తది.... అయ్యా రాజిరెడ్డి పటేలా! మామీన కోతుకం బెట్టుకోవద్దు. తమరు నిచ్చంగనే గరీబోల్ల పచ్చ మైతే దొరలతోని కాలి గోరంత అంటుసుత ఉంచుకోవద్దు— మునుపటి తీర్గ మల్ల పన్జేస్తే— మల్లదే ఊళ్లోలందరు సెబాసంటే గీ సంగం మీదే— లేదంటరో ఎవుల దారి వాల్ల ...." ఇట్లా చాలాసేపు మాట్లాడాడు....

"గీమాట బాగున్నది" పెంటయ్య అన్నాడు. అందరు లేచి నిలబడ్డారు....

అప్పటికే రాజిరెడ్డి లేచి నిలబడి తలవంచుకొని కాళ్ళీడుస్తూ ఇంటికేసి నడిచాడు....

879

* * *